Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 338 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 డిసెంబర్ 2023 బుధవారం పేజీలు : 4

## అయోధ్యకు ద్వారాలు హైదరాబాద్ నుంచి!

బోయినపల్లి : అయోధ్యలోని రామ మందిరంలో ఉపయోగించే తలుపులు హైదరాబాద్ న్యూ బోయిన పల్లిలోని అనురాధ టింబర్ డిపోలో రూపుదిద్దుకున్నాయి. నిరుడు జూన్‌లో తలుపుల తయారీ పనులు మొదలయ్యాయి. అప్పటి నుంచి తమిళనాడుకు చెందిన కుమారస్వామి, రమేశ్‌తో పాటు 60 మంది నిపుణులైన కళాకారుల బృందం తయారీ కోసం రాత్రింబవళ్లు కష్టపడుతోంది. తయారీలో బలార్షా టేకు ఉపయోగించారు. బంగారు పూతతో కూడిన 18 ప్రధాన ద్వారాల తలుపులతో పాటు మరో 100 తలుపులను తయారుచేశారు. యాదాద్రి ఆలయంలోని కలప కళాకృతులు అనురాధా టింబర్ సంస్థ ఆధ్వర్యంలోనే సిద్ధమవడం విశేషం.



# లోక్ సభ ఎన్నికల బరిలో

# కేసీఆర్ వర్సెస్ విజయశాంతి

# గేమ్ షురూ..!?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. త్వరలో జరిగే లోక్ సభ ఎన్నికల పైన ప్రధాన పార్టీలు కసరత్తు మొదలు పెట్టాయి. కాంగ్రెస్ లోక్ సభ ఎన్నికల్లోనూ తమ సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది. బీజేపీ అభ్యర్దుల కసరత్తు ప్రారంభించింది. కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల పరాజయం మరిపించి..పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు సిద్దమవుతున్నారు. అందులో భాగంగా స్వయంగా లోక్ సభ బరిలో నిలివాలని యోచిస్తున్నట్లు సమాచారం.

**లోక్ సభ ఎన్నికల సమరం :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన బీఆర్ఎస్ ఇప్పుడు లోక్ సభ ఎన్నికలకు సిద్దం అవుతోంది. దీని పైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమీక్షలు ప్రారంభించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ నేతలతో సోమవారం కేటీఆర్ సమావేశమయ్యారు. జనవరి 26వ తేదీలోగా సమావేశాలు పూర్తి చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో కుంగిపోవద్దని, పరాజయం చెందిన బీఆర్ఎస్ అభ్యర్థులే నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లని, వారు ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని కేటీఆర్ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలని, అసెంబ్లీల వారీగా భేటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చేవెళ్ల ఎంపీగా రంజిత్ రెడ్డి పేరు ఖరారు చేసారు.

**ఎన్నికల బరిలో కేసీఆర్ :** ఇక, ఓటమితో డీలా పడిన కేడర్ ను పార్లమెంట్ ఎన్నికలకు సిద్దం చేసేందుకు కేసీఆర్ కీలక నిర్ణయం ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం కేసీఆర్ స్వయంగా లోక్ సభ బరిలో దిగుతారని పార్టీ వర్గాల సమాచారం. తెలంగాణతో పాటుగా మహారాష్ట్రలోనూ బీఆర్ఎస్ అభ్యర్దులను బరిలోకి దింపుతున్నారు. కేసీఆర్ వచ్చే లోక్ సభ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీని వచ్చే ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేయాలని కోరుతున్నారు. కానీ, ఇప్పుడు మల్కాజ్ గిరి వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఐదేళ్ల పాటు పార్టీని లైమ్‌లైట్‌లో ఉంచాలంటే.. ఆపై వచ్చే మళ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీదారుగా బీఆర్ఎస్‌ను నిలపాలంటే వచ్చే లోక్‌సభ ఎన్నికలే కీలకం కానున్నాయి. దీంతో, తానే బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు సమాచారం. 2014 ఎన్నికల్లో కేసీఆర్ మెదక్ నుంచి ఎంపీగా..గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత ఎంపీగా రాజీనామా చేయటంతో కొత్త ప్రభాకర్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు.

**హోరా హోరీ పోరు :** మెదక్ నుంచి ఈ సారి కాంగ్రెస్ అభ్యర్దిగా విజయశాంతి పోటీ ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలోనే ఈ మేరకు హామీ ఇచ్చారు. విజయశాంతి 2009 ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎంపీగా గెలుపొందారు. ఆ సమయంలో టీఆర్ఎస్ నుంచి కేసీఆర్, విజయశాంతి ఇద్దరే ఎంపీలుగా ఉన్నారు. తరువాత జరిగిన పరిణామాల్లో విజయశాంతి పార్టీలు మారారు. పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన తరువాత జరుగుతున్న మొట్టమొదటి పార్లమెంట్ ఎన్నికలు. ఢిల్లీలో బీఆర్ఎస్ పేరు గట్టిగా వినిపించాలని పార్టీ నేతలకు కేసీఆర్ చెబుతున్నారు. దీంతో, కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగటం ఖాయమని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పైన దూకుడుగా వ్యవహరించాలని పార్టీ నేతలకు సూచిస్తున్నారు. దీంతో..తెలంగాణలో జరిగే లోక్ సభ ఎన్నికల్లోనూ హోరా హోరీ పోరు తప్పేలా లేదు.

# కాంగ్రెస్ కీలక నిర్ణయం.. మేడిగడ్డ వద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పీడ్ పెంచింది. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అవకతవకలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసింది. ఈ క్రమంలోనే మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 29వ తేదీన మేడిగడ్డ ప్రాజెక్ట్ సందర్శనకు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పవన్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. వివరాల ప్రకారం.. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో నెల 29వ తేదీన మేడిగడ్డ ప్రాజెక్ట్‌ను మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ సందర్శించనున్నారు. 29వ తేదీన మంత్రులు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో కాళేశ్వరం ప్రాజెక్ట్ వద్దకు చేరుకుంటారు. అనంతరం, మేడిగడ్డ బ్యారేజ్ వద్ద కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. ప్రాణిహిత, కాళేశ్వరం ప్రాజెక్ట్ వివరాలు.. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల జరిగిన లాభ, నష్టాలను వివరించనున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం మంత్రులు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యయం.. కొత్త ఆయకట్టు, స్థిరీకరణ ఆయకట్టు వివరాలను వెల్లడించనున్నారు. ప్రాజెక్ట? నిర్వహణకు అవసరమైన విద్యుత్‌పై ప్రభుత్వం స్పష్టతనివ్వనుంది.

అలాగే, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌ల సమస్యలు, వాటి పరిష్కారాలు, తదితర అంశాలపై ప్రభుత్వం సమీక్ష చేయనుంది. ఈ పర్యటనకు సంబంధించి నిర్మాణ సంస్థలకు సబ్ కాంట్రాక్టర్లలకు, ఈ నిర్మాణంలో సంబంధం ఉన్న వారికి అందరికి సమాచారం ఇచ్చి సమావేశంలో పాల్గొనేలా చర్యలు తీసుకోగలరని మంత్రులు ఈఎన్‌సీని ఆదేశించారు.







## 28న తెలంగాణలో అమిత్ షా పర్యటన

హైదరాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఖరారైంది. డిసెంబరు 28న మధ్యాహ్నం 12.05 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న అమిత్ షా.. అక్కడి నుంచి నేరుగా నోవాటెల్ హోటల్‌కు వెళ్తారు.

నోవాటెల్‌లో మధ్యాహ్నం 12.20 గంటల నుంచి 1.45 గంటల వరకు పార్టీ ముఖ్యనేతలతో సమావేశమవుతారు. అనంతరం 1.50 గంటలకు కొంగరకలాన్‌లో జరిగే భాజపా రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షించడంతో పాటు పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.

# పట్టు నిలుపుకునేందుకు...

# కాంగ్రెస్ పక్కా ప్లానింగ్

## తెలంగాణ నుంచి సోనియా పోటీ!

## సీటు ఫిక్స్ - బీజేపీ నుంచి సినీ సెలబ్రిటీ..!!

హైదరాబాద్ : తెలంగాణలో లోక్ సభ ఎన్నికల సమరం మొదలైంది. పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికే కాంగ్రెస్ 17 లోక్ సభ నియోజకవర్గాల్లో 12 స్థానాలకు దాదాపు అభ్యర్దులను ఖరారు చేసింది. బీజేపీ కేడర్ ను ఎన్నికలకు సిద్దం చేయటానికి ఈ నెల 28న అమిత్ షా హైదరాబాద్ వస్తున్నారు. అటు బీఆర్ఎస్ తో కేటీఆర్ చేవెళ్ల నుంచి లోక్ సభ ఎన్నికల సమీక్షలు ప్రారంభించారు.

ఈ సమయంలోనే కాంగ్రెస్ నేత సోనియా గాంధీ వచ్చే ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయటం ఖాయమనే ప్రచారం సాగుతోంది.

**మరో ఎన్నికల సమరం :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ ఇప్పుడు లోక్ సభ సమరానికి సిద్దం అవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై కసరత్తు ప్రారంభించింది. మరోవైపు.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణ నుంచి పోటీ అంశాన్ని హైకమాండ్ పరిశీలిస్తోంది. సోనియాను మాల్కాజ్‌గిరి నుంచి పోటీ చేయించే ఆలోచనలో తెలంగాణ నేతలు ఉన్నట్టు సమాచారం. కాగా, సీఎం రేవంత్ మాల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా గెలిచారు. తొలుత మెదక్ నుంచి సోనియా ను పోటీ చేయించాలని భావించినా...ఢిల్లీ నేతల చర్చల తరువాత ఇప్పుడు సోనియాను మల్కాజ్ గిరి నుంచే పోటీ చేయించే అవకాశముందని చెబుతున్నారు. కాగా, సంక్రాంతికి కాంగ్రెస్ అభ్యర్థులను ఫైనల్ చేసే అవకాశం ఉంది.

**సోనియా పోటీ చేస్తారా :** బీఆర్ఎస్ కు మల్కాజ్ గిరి ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా గెలవలేదు. మాజీ మంత్రి మల్లారెడ్డిని ఇక్కడ బరిలోకి దింపే అవకాశం ఉంది. సోనియా పోటీకి దిగితే బీఆర్ఎస్ కు ఈ సీటు లో గెలుపు ప్రతిష్ఠాత్మకంగా మారనుంది. ఇక, బీజేపీ నుంచి పలువరు ముఖ్య నేతలు మల్కాజ్ గిరి సీటు కోసం పోటీ పడుతున్నారు. మల్కాజ్‌గిరి దేశంలోనే అతి పెద్ద పార్లమెంట్ నియోజకవర్గం. ఇక్కడ ఉత్తరాది ప్రభావం ఎక్కువ. కచ్చితంగా మోడీ ఫ్యాక్టర్ పనిచేసే అవకాశం ఉంది. 2019 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి ఎన్.రామచంద్రరావు పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఈసారి తనకు ఛాన్స్ ఉంటుందేమోనని ఈటల భావిస్తున్నారు. అయితే ఇదే సీటు మీద జాతీయ నేత మురళీధర్ రావు ఫోకస్ చేయడం ఆసక్తిగా మారింది. అయితే, సోనియా పోటీ చేయటం ఖాయమైతే ఇక్కడ నుంచి సినీ సెలబ్రెటీని బరిలోకి దింపే ఆలోచన లో బీజేపీ ఉన్నట్లు పార్టీ నేతల్లో చర్చ సాగుతోంది.

బీజేపీ నుంచి ఎవరు : కొద్ది రోజుల క్రితం వరకు ప్రధాని మోదీ సైతం దక్షిణాది నుంచి ఈ సారి పోటీ చేయబోతున్నారని..అందులో భాగంగా మల్కాజ్ గిరి నుంచి పోటీకి ఛాన్స్ ఉందనే ప్రచారం జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి సోనియా పోటీ ఖాయమని కాంగ్రెస్ నేతలు చెబుతున్న సమయంలో బీజేపీ నుంచి ఎవరిని బరిలోకి దించుతారనేది ఆసక్తి కరంగా మారింది. గతంలో టీడీపీలో రాజ్యసభ సభ్యురాలిగా, తరువాత సమాజ్ వాదీ పార్టీ ఎంపీగా యూపీ నుంచి పని చేసిన ఒక ప్రముఖ మాజీ హీరోయిన్ జయప్రద, మారో హీరోయిన్ మాజీ ఎమ్మెల్యూ జయసుధ పేర్లను ను పరిగణలోకి తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. మల్కాజ్ గిరి లోకసభ పరిధిలో ఏపీ మూలాలు చెందిన ఓటర్లు ఎక్కువగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు నాలుగు ఉన్నాయి. దీంతో, వారి ఓట్లతో పాటుగా మోదీ ఛరిష్మా కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. సోనియా పోటీ ఖరారైతే బీజేపీ తమ అభ్యర్దిని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.







# సంపాదకీయం

## భారత్ కొంప ముంచే పని చేయనున్న పొరుగు దేశం?

ఇటీవల కాలంలో ఏ దేశమూ చేయని ప్రయోగం అణు పరీక్ష. 1998లో భారత్, ఆ వెంటనే పాకిస్థాన్ అణు పరీక్షలు నిర్వహించాయి. ఆ తర్వాత ఇరాన్, ఉత్తర కొరియా తరచూ ఇలాంటివి చేస్తుంటాయనే కథనాలు వచ్చినా నిర్ధారణ కాలేదు. అయితే, ఓ దేశం మాత్రం త్వరలో అణు పరీక్షలకు దిగనుందనే కథనాలు వస్తున్నాయి. అది కూడా మామూలు దేశం కాదు. ప్రపంచంలో జనాభాలో టాప్. ఆర్థిక వ్యవస్థలో టాప్ 3. ఇంకా చెప్పాలంటే సూపర్ పవర్ పొజిషన్ కు చాలా దగ్గరగా ఉంది. ఇక ఆ దేశం తీరే వేరు. చిన్న విషయానికీ కయ్యానికి కాలుదువ్వుతుంది.. తమ ప్రయోజనాలే తప్ప ఇతర విషయాలు ఏవీ పట్టించుకోదు.. పొరుగు దేశాల భూభాగాలపై కన్నేస్తుంది.. అవసరమైతే సరిహద్దులను మార్చేస్తుంది.. ఇతర దేశాల భూభాగాలతో మ్యాప్ లు విడుదల చేస్తుంది.. అందులోని ప్రదేశాలకు పేర్లు పెడుతుంది. ఎక్కడో దూరంగా ఉన్న దేశాలకు ఆర్థిక సాయం చేసి వాటిని రుణ బంధంలో ఇరికించి ప్రయోజనం పొందుతుంది. ఇప్పుడలాంటి దేశం మరో బాంబు పేల్చేందుకు సిద్ధమవుతోంది.

**60 ఏళ్ల కిందట ఎక్కడైతే..** కమ్యూనిస్టు చైనా మరోమారు అణు పరీక్షకు సిద్ధమవుతోందనే కథనాలు వస్తున్నయి. అరవయ్యేళ్ల క్రితం పరీక్షలు జరిగిన ప్రాంతంలోనే జోరుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పశ్చిమ దేశాల నిఘావర్గాలు గమనించాయి. జిన్‌జియాన్ రీజియన్‌లోని లాప్ నుర్ న్యూక్లియర్ పరీక్ష కేంద్రాన్ని మళ్లీ క్రియాశీలం (రీయాక్టివేషన్) చేస్తున్నదని తెలుస్తోంది. ఈ విషయాన్ని మక్సర్ శాటిలైట్ చిత్రాలను విడుదల చేసింది. ఉక్రెయిన్ యుద్ధ సమయంలోనూ ఇదే సంస్థ శాటిలైట్ ఫొటోలు విడుదల చేసింది. మరోవైప అమెరికా మీడియా సంస్థ న్యూయార్క్‌టైమ్స్ చైనా అణు పరీక్షలకు సిద్ధం అవుతున్నదంటూ సంచలన కథనం ప్రచురించడం పెద్దఎత్తున చర్చకు తావిస్తోంది.

**అప్ గ్రేడా? లేక ..? :** జిన్ జియాన్ లోని అణు పరీక్ష కేంద్రాన్ని చైనా అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు శాటిలైట్ చిత్రాల్లో కనిపిస్తున్నది. ఆరేళ్ల కిందట ఈ ప్రదేశంలో కొన్ని భవనాలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడది ఆధునికీకరణ అయింది. అణు పరీక్షకు సిద్ధమవుతున్న సంకేతాలతో ఫెన్సింగ్ తో కూడిన అత్యాధునిక కాంప్లెక్స్‌లు వచ్చాయి. భారీ స్థాయి పేలుళ్లను నిర్వహించేలా బంకర్, కొత్త ఎయిర్ బేస్ నిర్మాణాల్లో ఉన్నాయి. 90 అడుగుల పొడవైన పెద్ద డ్రిల్లింగ్ మెషీన్ కూడా ఉండడం గమనార్హం. అయితే, పూర్తిస్థాయిలో అణు పరీక్షలు లేదా సబ్ క్రిటికల్ అణు పేలుళ్లను నిర్వహించేలా కనిపిస్తున్నదని ఇంగ్లిష్ మీడియా పేర్కొంటోంది. కొత్త తరం బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో వినియోగించే కొత్త న్యూక్లియర్ వార్ హెడ్‌లను పరీక్షించేందుకు, వాటి సామర్థ్యాన్ని పరిశీలించేందుకు చైనా ఆసక్తి కనబరుస్తున్నట్టు స్పష్టవుతోంది. 2013లో చైనా వద్ద 50 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఉండగా.. 2028 నాటికి ఆ సంఖ్యను వెయ్యికి పైగా పెంచాలని చూస్తోంది. మరోవైపు వుయ్ గర్ ముస్లింలు అధికంగా ఉండే జిన్ జియాంగ్ ప్రాంతంలోనే చైనా అణు పరీక్షలు చేపడుతోంది. ఈ జాతి వారిని సమూలంగా నిర్మూలించాలనే ఉద్దేశంలో ఉందని చైనాపై ముస్లిం దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

**భారత్ బహు పరాక్..** భారత్ 25 ఏళ్ల కిందట రెండోసారి అణుపరీక్షలు చేసి.. అనంతరం స్వచ్ఛందంగా నిషేధం విధించుకుంది. అణ్వాయుధాల ఆధునికీకరణకు కొత్తగా పరీక్షలు చేయకుండా కంప్యూటర్ సిమ్యులేషన్ మీద ఆధారపడుతోంది. ఇప్పుడు చైనా ఏకంగా పరీక్షలకు సిద్ధమవుతోందనే కథనాలను కాస్త తీవ్రంగా తీసుకోవాల్సిందే. ఇక పాతికేళ్ల కిందటితో పోలిస్తే చైనా మరింత బలోపేతం అయింది. సూపర్ పవర్ స్థానానికి అమెరికాతో పోటీ పడుతోంది. ఇలాంటి సమయంలో ఆ దేశం చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందే.

# బడుగు బలహీన సబండ వర్గాల అభ్యున్నతే సిపిఐ లక్ష్యం

## బాలాజీ నగర్ లో సి.పి.ఐ 99వ ఆవిర్భావ దినోత్సవం




జవహర్ నగర్ (గరుడ వార్త) : భారత కమ్యూనిస్ట్ పార్టీ

(సీపీఐ ) 99వ వ్యవస్థాపక దినోత్సవ స్ఫూర్తితో అర్హులైన పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకు రాష్ట్ర ప్రభుత్వంతో తమ పోరాటం కొనసాగుతుందని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ స్పష్టంచేసారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) 99వ వ్యవస్థాపక దినోత్సవంను పురస్కరించుకొని మంగళవారం బాలాజీ నగర్- సీపీఐ కాలనీలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీటీసీ తోటపల్లి శంకర్ మాట్లాడుతూ... 1925 డిసెంబర్ 26న ఉత్తర్ ప్రదేశ్ లోని కాన్పూర్ నగరంలో సీపీఐ ఆవిర్భవించిందని, భారత దేశ స్వాతంత్ర పోరాట ఉద్యమంలో సీపీఐ పార్టీ ప్రధాన భూమిక ను పోశించిందన్నారు. కార్మికులు, శ్రామికులు బడుగు బలహీన వర్గాల కోసం, రైతులు, వ్యవసాయ కూలీలు, యువతీ యువకులు, మధ్య తరగతి, పేదల ప్రజల సంక్షేమం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు జరిగాయని, వారి హక్కులను సాధించిందన ఘన చరిత్ర సీపీఐకి ఉందని అన్నారు. దేశ సమగ్రత కోసం మా దేహం ముక్కలైన ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం అంటూ దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఉగ్ర మూకల దాడులకు సీపీఐ మొక్కవోణీ ధైర్యంతో ఎదుర్కొందన్నారు. చట్ట సభలలో సీట్లు ఉన్న లేకున్నా శ్రామిక జనావలి కోసం సీపీఐ పోరాడుతుందని అన్నారు. మేడ్చల్ జిల్లాలో సీపీఐ ఆధ్వర్యంలో జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలో స్వంత ఇండ్లు లేని వేలాది మంది పేదల కోసం ఇండ్లు, ఇండ్ల స్థలాలు దక్కేవరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసివచ్చే ప్రజా తంత్ర వాదులను, శక్తులను కలుపుకొని పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి. స్వరూప, సీపీఐ కాప్రా మండల కార్యదర్శి యాదయ్య, సహాయ కార్యదర్శి రాజేశ్వరి, జిల్లా యువజన సమాఖ్య నాయకులు పెద్దమెతరీ లక్ష్మణ్, ఏఐటీయూసీ నాయకులు ఎల్లయ్య, సీపీఐ నాయకులు నర్సింహా, కీసర మండల సహాయ కార్యదర్శి రవి నాయక్, మహిళ నాయకురాళ్లు మల్లిక, విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి శామీర్ పేట మండల అభివృధికి తోడుపాటునందించాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు విన్నవించిన ఉమ్మడి శామీర్పేట్ మండల కాంగ్రెస్ నాయకులు



శామీర్ పెట్ (గరుడ వార్త) : తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పరిదిలోని శాఖల్లో ఉమ్మడి శామీర్ పేట మండల అభివృధికి తోడుపాటునందించాల్సిందిగా శామీర్పేట్ మండల కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో ఉమ్మడి శామీర్ పేట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి కలిసిన వారిలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గోనె మహేందర్ రెడ్డి, మండల ఎంపిటిసి ఫోరం అధ్యక్షుడు గోనె హనుమంత్ రెడ్డి, అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో దత్త జయంతి వేడుకలు



శామీర్ పెట (గరుడ వార్త) : దత్తత్రేయ జయంతి పురస్కరించుకొని ఉద్దమర్రి గ్రామంలో దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూడు చింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలోని శక్తి సాయి సదనాలై షిరిడి సాయి ద్వారకామయి ధ్యాన మందిర్ లో శ్రీ దత్తాత్రేయ జయంతి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈవేడుకలు సాయిబాబా మందిర ఆలయ వ్యవస్థాపకులు పూజ్య సద్గురు శ్రీ సాయిరాజ్ బాబా గారి ఆధ్వర్యంలో ఈవేడుకలు కనుల పండుగ జరిగాయి. శ్రీ దత్త జయంతి సందర్భంగా సద్గురు శ్రీ సాయి రాజ్ బాబా మందిరంలో సాయిబాబా, శివాలయం, దత్తాత్రేయ స్వామి, విగ్నేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సరస్వతి దేవి, దుర్గామాత, శ్రీ లక్ష్మీదేవి అమ్మవారు, శ్రీ ఆంజనేయ స్వామి, నవగ్రహాలు, దూని కి బాబా స్వయంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు బాబా సందేశం ఇస్తూ సంకల్పం ఉంటే భగవంతుని అనుగ్రహం కచ్చితంగా ప్రాప్తిస్తుందని వివరించారు. యాప్రాల్ కు చెందిన శ్యాంరావు భజన మండలి ఆధ్వర్యంలో సాయిబాబా, దత్తాత్రేయ స్వామి గీతాలను ఆలపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

జవహర్ నగర్ (గరుడ వార్త) : గంజాయి విక్రయిస్తున్న నలుగురిని జవహర్ పోలీసులు అరెస్ట్ చేశారు.

జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుంధతి నగర్ వద్ద గంజాయి విక్రయిస్తూ వినియోగిస్తున్న నలుగురు వ్యక్తులను జవహర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలనుసారం... విజయ్, పవన్ కుమార్, ప్రశాంత్, అరుణ్ కుమార్ నుండి 250 గ్రాముల గంజాయి అదే విధంగా గంజాయిని తాగడానికి ఉపయోగించే రెండు చిన్న సీసాలు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లుగా జవహర్ నగర్ పోలీసులు తెలిపారు.

# అసభ్యంగా ప్రవర్తించిన నేరస్థుడిపై 7సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

## 50వేల జరిమానా : జిల్లా అదనపు ఎస్.పి అడ్మిన్ ఎస్.మహేందర్

మెదక్ : మంగళవారం నాడు జిల్లా అదనపు ఎస్.పి అడ్మిన్ ఎస్.మహేందర్ మాట్లాడుతూ. మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి తనని నేరస్థుడు చంపుతానని బెదిరించి అపహరించి తనతో తీసుకెల్లి వేరే చోట వదిలేసి వెళ్ళినాడు అని మా పాపతో అసభ్యంగా ప్రవర్తించిన నేరస్థుడు పై చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా పోలీస్ వారు కేసు నమోదు చేసి అట్టి సాక్షాదారాలను కోర్ట్ కి నివేదించడ మైనదని అన్నారు. పూర్తి సాక్షాదారాలను పరిశీలించిన జిల్లా ప్రధా న సెషన్స్ జడ్జి పి లక్ష్మీ శారద కేసులో నిందితులైన నేరస్థుడికి 7 సంవత్సరా ల కఠిన కారాగార శిక్ష మరియు రూ. 50,000/- జరిమానా విదించినారు.ందితుని వివరాలు మహమ్మద్ ముస్తఫా బెగ్ ఏ ముజ్జు తండ్రి ఖాజా బెగ్ నిందితుడు మెదక్ జిల్లా శివం పేటమండలం నవంపేట గ్రామానికి చెందిన వ్యక్తిని జిల్లా మెదక్ జిల్లా విచారణ అధికారులు.పి.రాజ్ కుమార్ అడిషనల్ పి పి స్పెషల్ ట్రయల్ పి ఓ సి ఎస్ ఓ కోర్టు మెదక్ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ .మహమ్మద్ రఫీయుద్దిన్ ఏఎస్ ఐ.శివానందం తూప్రాన్ ఎస్.ఐకోర్ట్లైజనింగ్కానిస్టేబుళు ్.మల్లారెడ్డి ఎస్.ఐ కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ,జి. రవీందర్ గౌడ్, కోర్ట్ కానిస్టేబుల్. నాగరాజు కోర్ట్ కానిస్టేబుల్.కేసు యొక్క పూర్తి సాక్షాదారాలను సేకరించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని ఈ సంధర్భంగా వారు అభినందించారు.

# పక్కదారి పట్టిస్తూ.. తప్పుడు లెక్కలు చూపిస్తూ

భగత్‌నగర్: జిల్లాలో రేషన్ బియ్యం రీ సైక్లింగ్ దందా జరుగుతోంది. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు బియ్యం పట్టించమని అప్పగిస్తే పక్కదారి పట్టిస్తున్నారు. ఆ ధాన్యం స్థానంలో మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తున్న రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి భర్తీ చేస్తూ లెక్కలు సరి చేస్తున్నారు. ఈ అక్రమాలను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన జిల్లా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

బ్లాక్ లిస్టులో పెట్టాలి

సీఎంఆర్ కేటాయించిన మిల్లులను పౌర సరఫరాల శాఖాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించడం.. పర్యవేక్షణ చేస్తూ నిల్వలు సజావుగా ఉన్నాయా లేవా? అని పరిశీలించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిశీలన సమయంలో హడావుడి చేయడం తప్పా పెద్దగా పరిశీలించిన దాఖలాలు లేవు. మిల్లులపై పర్యవేక్షణ కొరవడి నిల్వలు రికార్డులకు అనుగుణంగా లేవన్న విషయం పలుమార్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేస్తుండగా అక్రమాలను అరికడుతూ ఇప్పటికే బకాయిదారులుగా తేలిన మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాల్సిన అవసరముంది.

ప్రభుత్వ ధాన్యాన్ని విక్రయిస్తున్న మిల్లర్లు

మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం రెండు నెలల్లో మర ఆడించి ఇవ్వాలి. మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం కేటాయిం



పులు జరుగుతుండటంతో మిల్లింగ్ సకాలంలో చేయలేకపోతున్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు గడువు పెంచాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఇలా గడువు పెంచడాన్ని మిల్లర్లు అవకాశంగా మార్చుకుంటున్నారు. ధాన్యం మిల్లింగ్‌ను ఆలస్యం చేస్తున్నారు. మిల్లింగ్ కోసం ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని బియ్యంగా మలిచి ఎగుమతి చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. విక్రయించిన బియ్యం స్థానంలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. తద్వారా తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ సీఎంఆర్ లెక్కల కింద ప్రభుత్వానికి జమ చేస్తూ దోచుకుంటున్నారు.

తనిఖీ..ఈ నెల 16న మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని ఓ రైస్ మిల్లులో 30 సంచుల్లో రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు పౌర సరఫర శాఖాధికారులకు సమాచారం అందించారు. పౌర సరఫరా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సదరు రైస్ మిల్లును తనిఖీ చేయడంతో 1100 క్వింటాళ్ల ధాన్యం తక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయమై సదరు మిల్లు యజమానిని తనిఖీకి వచ్చిన అధికారులు ప్రశ్నిస్తే బియ్యం వర్షానికి తడిసి చెడిపోయిందని.. ఆ ధాన్యాన్ని ఇథనాల్ పరిశ్రమకు విక్రయించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. మార్చిలో సీఎంఆర్ బియ్యం సకాలంలో ఇవ్వని రైస్ మిల్లులకు అప్పటి జిల్లా పాలనాధికారి కర్ణన్ 53 రైస్ మిల్లులకు నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులు జారీ చేసిన జాబితాలో ఈ మిల్లు ఉండటం విశేషం.

# పర్యవేక్షణ లోపం.. సేవల్లో నిర్లక్ష్యం

మంచిర్యాల :జిల్లా కేంద్రానికి చెందిన ఓ 19 ఏళ్ల యువతి.. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో శుక్రవారం ఉదయం ఆసుపత్రిలో చేర్చారు. తీవ్రత ఎక్కువగా ఉన్న పట్టించుకోకుండా కుటుంబసభ్యులు కొంత నిర్లక్ష్యం చేశారు. జీజీహెచ్‌కు తీసుకొచ్చిన తరువాత వైద్యులు మరికొంత జాప్యం చేసినట్లు వారి బంధువుల నుంచి ఆరోపణలు వచ్చాయి. విషమ పరిస్థితిని గుర్తించలేకపోవడం, కొద్దిసేపటి వరకు ఆసుపత్రిలోనే చికిత్స అందించే ప్రయత్నం చేశారు. అనంతరం వరంగల్‌కు రెఫర్ చేశారు. కానీ అప్పటికే నష్టం జరిగిపోయి యువతి మృతి చెందింది.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పర్యవేక్షణ లోపం.. వైద్యుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. వైద్య కళాశాల, అనుబంధ జీజీహెచ్ పూర్తి బాధ్యత ప్రిన్సిపల్‌ది కాగా ఆసుపత్రి నిర్వహణకు సూపరింటెండెంట్, ఇద్దరు ఆర్‌ఎంఓలు అందుబాటులో ఉన్నారు. వీరి కింద ఒక్కో విభాగానికి హెచ్‌ఓడీ(ప్రొఫెసర్), ఆ తర్వాత అసోసియేటెడ్, వీరి కిందిస్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు.. ఇలా ఇంత మంది ఉన్నా సేవల్లో జాప్యంతోపాటు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. అసిస్టెంట్లు సైతం కొంతమంది ఓపీ విభాగాలను ఎస్‌ఆర్(సీనియర్ రెసిడెంట్)లు, పీజీ విద్యార్థులకు వదిలేయడంతో వారు బాధితుల పరిస్థితిని పసిగట్టడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రొఫెసర్లు ఆసుపత్రికి రావడమే గగణమని కిందిస్థాయి సిబ్బంది చెబుతున్నారు. జీజీహెచ్‌లో నిత్యం అవసరమయ్యే మాత్రలతోపాటు అత్యవసర సమయంలో ఇచ్చే మందులు అందుబాటులో ఉండటం లేదని బాధితులతోపాటు వైద్యులు తెలుపుతుండటం గమనార్హం. విటమిన్-సి మందుల సరఫరా పూర్తిగా లేదని ఫార్మసి సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల బెల్లంపల్లి నియోజకవర్గానికి చెందిన ఓ బాధితురాలు తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా ఆమె తల్లి జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. నడవలేని పరిస్థితులో ఉన్న ఆమెను ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స అందించాలని వైద్యులను కోరారు. కానీ వైద్యుడు మందులు రాసిచ్చి ఇంటికి వెళ్లాలని సూచించారు. ఆమె జ్వర పరిస్థితి.. ఆసుపత్రిలోనే చికిత్స అందించాల్సిన అవసరం ఉందా.. లేదా.. అనేది వైద్యులకే తెలిసి ఉంటుంది. అయినా బాధితురాలి తల్లి భయం దృష్ట్యా చేర్చుకోవడంలో ఎలాంటి ఇబ్బంది లేదు కదా అని ఆ దృశ్యం చూసిన పలువురి వాదన. ఆ సమయంలో పడకల సమస్య కూడా లేదు.

ఈ చిత్రం.. పర్యవేక్షకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. స్లాబు పెచ్చులూడిన గదిలోనే ఓ చిన్నారికి చికిత్స అందిస్తున్నారు. ఇటీవలే ఇదే చోట త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అయినా ఆసుపత్రి నిర్వాహకుల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు.ఇది.. రెండో అంతస్తులోని చిన్నారుల వార్డు. వారి కోసమే ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఈ గదిలో ఇలా ఖాళీ పడకలు ఉన్నాయి. ఎంసీహెచ్‌ను ఇక్కడి నుంచి తరలించిన రోజు నుంచి గది ఖాళీగానే ఉంచుతున్నారు తప్పితే చిన్నారులకు కేటాయించడం లేదు.

# సమస్యలకు నిలయంగా పెద్దాసుపత్రి

జగిత్యాల : ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి అసౌకర్యాల మధ్యే కొనసాగుతోంది. హోదా మారినా సేవలు ఆధునికీకరించినా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడంలేదు. గతంలో ప్రాంతీయ ఆసుపత్రిగా సేవలందించిన ఈ ఆసుపత్రి ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధంగా కొనసాగుతోంది. 150 పడకల ఆసుపత్రిలో 4 విభాగాలున్నాయి. జనరల్ మెడిసిన్, ఆర్థో, జనరల్ సర్జన్, న్యూరో సేవలందుతున్నాయి. మొత్తం 37 మంది ప్రొఫెసర్లు, వైద్యులు ఇక్కడ పనిచేస్తున్నారు. నిత్యం 300 నుంచి 400 ఔట్ పేషంట్లు చికిత్స కోసం వచ్చి వెళ్తున్నారు. 150కిపైగా రోగులు ఇన్‌పేషంట్లుగా సేవలు పొందుతున్నారు. సీజనల్ జ్వరాల సమయంలో రోగుల సంఖ్య రెట్టింపవుతోంది. ఈ ఆసుపత్రి నుంచి ప్రధానమైన ప్రసవాల విభాగాన్ని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. విభాగాలు తగ్గించి సేవలు విస్తరించినా పలు సమస్యలు ఆసుపత్రిని వీడటంలేదు.

ఆసుపత్రికి దారేదీ..?

సాధారణ ఆసుపత్రి ముందే పాతబస్టాండు, పురపాలక కార్యాలయం, రెండు వైపులా ప్రధాన రహదారి ఉండటంతో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుంది. ఈ క్రమంలో ఆసుపత్రికి అంబులెన్సులు రావాలన్నా, వెళ్లాలన్నా కష్టతరమే. ఆసుపత్రి ఎదుట అనధికారికంగా ఆటోలు, తోపుడుబండ్లు, ఇతర ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేయడంతో



అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చే వాహనాలకు మార్గం దొరకటంలేదు. గతంలో పోలీసుశాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా మళ్లీ ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

వైద్య కళాశాల నిర్మాణంతోనే పరిష్కారం..

ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం పూర్తయితే సాధారణ ఆసుపత్రి సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ధరూరుక్యాంపులో కళాశాల, ఆసుపత్రి నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాదికల్లా అధునాతన సేవలు అందుబాటులోకి వస్తాయి అప్పటి వరకు పాత భవనంలోనే అత్యవసర సేవలందించనున్నారు. పాత భవనంలోని సేవలు వైద్య కళాశాలకు మార్చితే ఇక్కడ విభాగాలు తగ్గించి సేవలు విస్తరించే సౌలభ్యం ఉంది.

అత్యవసర వైద్యానికి చోటేదీ?

సాధారణ ఆసుపత్రిలో అత్యవసర వైద్య విభాగం కీలకమైంది. ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు, అత్యవసర వైద్యానికి వచ్చినవారికి ఒకేచోట వైద్య సేవలందించాల్సిన దుస్థితి నెలకొంది. రోగులను పరీక్షించేందుకు వైద్యులకు సరిపడా గదులు లేవు. అత్యాధునిక వైద్య పరీక్షలకు కూడా గదులు చాలక ఇబ్బందులు తప్పడంలేదు. కొన్ని సందర్భాల్లో అత్యవసర చికిత్సకు వచ్చిన రోగులు నిరీక్షించాల్సి వస్తోంది. మధ్యాహ్నం రెండు గంటల తరువాత వచ్చే ఓపీ కోసం ప్రత్యేక ఏర్పాట్లు లేకపోవడంతో రోగులు నిరాశ చెందుతున్నారు.

శవ పరీక్షకు తప్పని నిరీక్షణ

ఆసుపత్రిలో దక్షిణం వైపున ఉన్న శవాగారంలో శవపరీక్ష చేస్తున్నారు. మూడున్నర దశాబ్దాల నాటి ఈ శవాగారం ఇప్పటి పరిస్థితికి అనుకూలంగా లేదు. శవాలను భద్రపరిచేందుదకు రెండే ఫ్రీజర్లున్నాయి. ఒక్కోసారి నాలుగైదు మృతదేహాలు వస్తే శవ పంచనామాకు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని సంబంధీకులు వాపోతున్నారు. కనీసం నాలుగైనా ఫ్రీజర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆ దిశగా వైద్యశాఖ చర్యలు చేపట్టడంలేదు.

# పునరుద్ధరిస్తేనే పరిష్కారం

రాయికల్ : బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లో ఫ్లోరైడ్ బాధితులతోపాటు గోదావరి పక్క నుంచే పారడమే కాకుండా రోళ్లవాగు ప్రాజెక్టు ఉన్నప్పటికీ ప్రతి వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో 1990-91లో అప్పటి ప్రభుత్వం బీర్‌పూర్‌లో రూ.2కోట్లతో ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాలతోపాటు ధర్మపురి మండలానికి నీటిని సరఫరా చేశారు. మిషన్ భగీరథ రావడంతో పథకాన్ని మూలన పడేశారు. గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరిగా రాకపోవడంతో కొంత కాలంగా మళ్లీ సమస్య ఏర్పడుతుంది. ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వాటిని పరిశీలించి పునరుద్ధరణకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందించాలన్న గత ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోవడంతో గతంలో మూలన పడిన పథకాలకు మరమ్మతు చేపడితే జగిత్యాల నియోజకవర్గ పరిధిలో 120 లక్షల లీటర్ల నీటిని అందించే వీలు ఏర్పడనుంది. జగిత్యాల నియోజకవర్గ పరిధిలో గతంలో నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడంతో బీర్‌పూర్, రాయికల్, పొలాస ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకాలు నిరుపయోగంగా మారాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామాలకు అవసరమైన నీటిని సరఫరా చేయకపోవడమే కాకుండా పైపులైన్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో గ్రామాలకు మిషన్ భగీరథ నీరు చేరుకోవడంలేదు. మిషన్ భగీరథ నీటిని కిలోమీటర్ల దూరం నుంచి సరఫరా చేయడంతో క్లోరినేషన్ జరగడంలేదని, తిరిగి పంచాయతీలలో చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నప్పటికీ ఎక్కడా ఆ ప్రక్రియ జరగడంలేదు.

రూ.5 కోట్లతో ప్రతిపాదనలుపథకాల పునరుద్ధరణకు అవసరమైన నిధుల కోసం అధికారులు దాదాపు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులో బీర్‌పూర్ పథకానికి రూ.1.90 కోట్లు, రాయికల్, పొలాస పథకాలకు రూ.1.50 కోట్ల చొప్పున ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు. మరమ్మతు పూర్తయితే నియోజకవర్గ పరిధిలోని రాయికల్, జగిత్యాల మండలంలో 50 లక్షల లీటర్ల చొప్పున, బీర్‌పూర్ మండలంలో 20 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పనుంది. రాయికల్ పథకానికి రామాజీపేట-భూపతిపూర్ గ్రామాల మధ్యన ఉన్న చెరువు నుంచి, బీర్‌పూర్ పథకానికి రోళ్లవాగు ప్రాజెక్టు నుంచి తరలించనున్నారు.రాయికల్‌లో గతంలో రూ. 6 కోట్ల వ్యయంతో సమగ్ర నీటి పథకం ద్వారా మండలంలోని రాయికల్, రామాజీపేట, భూపతిపూర్, కుమ్మరిపెల్లి, ఇటిక్యాల్, చెర్లకొండాపూర్ గ్రామాలకు శుద్ధ జలం అందించడమే లక్ష్యంగా 2007లో మండల కేంద్రంలో ఫిల్టర్‌బెడ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఏడేళ్లకు పనులు పూర్తి చేశారు. అంతేకాకుండా అటవీ గ్రామాలకు నీరు సరఫరా చేయాలనే ఉద్దేశంతో మరో రూ.4 కోట్లతో పైపులైన్ నిర్మాణాలను పూర్తి చేశారు. పూర్తయిన పథకాన్ని 2014 జనవరి 11న ప్రారంభించిన కొద్దిరోజులు నీటి సరఫరా జరిగినప్పటికీ మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడంతో పథకం నిరుపయోగంగా మారింది.

# నల్లబంగారం.. సిరుల సింగారం



గోదావరిఖని : వందేళ్లకు పైగా చరిత్ర.. బొగ్గు ఉత్పత్తి రంగంలో అపార అనుభవం.. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మార్పులు.. అవాంతరాలను అధిగమిస్తూ ప్రగతి పథం వైపు దూసుకుపోతున్న సింగరేణి 135వ వసంతంలోకి అడుగుపెడుతోంది. ఆంగ్లేయుల కాలంలో ఆవిర్భవించిన సింగరేణి నిజాం పాలకుల పరిపాలనలో మనుగడ సాగించింది. సామాజిక బాధ్యత.. సంక్షేమ ఫలాలను అందిస్తూ తనకంటూ ప్రత్యేకతను చాటుకుంది. కొత్తగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ బొగ్గు ఉత్పత్తిలో రికార్డులు సాధిస్తోంది. విద్యుత్తు ఉత్పత్తి రంగంలో సైతం ప్రత్యేకతను చాటుతోంది. సింగరేణి సంస్థ 1870లో ఆవిర్భవించగా 1889లో బొగ్గు ఉత్పత్తి మొదలు పెట్టి ఆరు జిల్లాల్లో విస్తరించింది. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న బొగ్గు నిక్షేపాలను వెలికితీస్తూ దేశ ప్రగతికి ప్రధాన ఇంధన వనరుగా మారింది. శనివారం ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న సింగరేణిపై ప్రత్యేక కథనం.

ప్రత్యామ్నాయంపై దృష్టి

బొగ్గు ఉత్పత్తిలో అపార అనుభవం ఉన్న సింగరేణి ప్రత్యామ్నాయ పరిశ్రమల ద్వారా మరింత భవిష్యత్తును పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తోంది. థర్మల్ విద్యుత్తు కేంద్రాలతో పాటు సోలార్ పవర్‌స్టేషన్‌లను నెలకొల్పి విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. సంస్థ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ గ్రిడ్‌కు సరఫరా చేస్తూ ఆదాయాన్ని పెంచుకుంటోంది. దీంతో పాటు హైడ్రోజన్ వాయువును తయారు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఇతర రాష్ట్రాల్లో బొగ్గుగనులను తీసుకున్న సింగరేణి ఇప్పటి వరకు 224 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సౌరవిద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసింది. థర్మల్ విద్యుత్తు కేంద్రాల ద్వారా 1200 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న సంస్థ అందుకు అవసరమైన బొగ్గును సొంతంగా గనుల నుంచి సరఫరా చేస్తుంది. ఇటు బొగ్గు ఉత్పత్తి, అటు విద్యుత్తు ఉత్పత్తితో సంస్థ మనుగడను పదిలం చేసుకుంటోంది. కొత్తగా మరో 300 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసింది.

గనుల విస్తరణకు ప్రణాళికలు

రానున్న ఏడాదిలో కొత్తగా మూడు గనులను సంస్థ ఏర్పాటు చేయనుంది. వీకే కోల్‌మైన్స్‌తో పాటు రొంపేడు ఓసీపీ, గోలేటి ఓసీపీలను ఏర్పాటు చేసి ఏటా 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకు ద్వారా ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టేందుకు పనులు నిర్వహిస్తోంది. వీటితో పాటు రామగుండం ప్రాంతంలో మెగా ఓసీపీని విస్తరించేందుకు కసరత్తు చేస్తోంది. జీడీకే-10, 10ఎ, ఓసీపీ-1, వకీల్‌పల్లి గనుల పరిధిలో మెగా ఓసీపీని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రానున్న కాలంలో ఇవి అందుబాటులోకి వస్తే సింగరేణికి మరింత భవిష్యత్తు ఉంటుంది.

సందర్శన ప్రాంతాలుగా గనులు

బొగ్గు ఉత్పత్తిలో ఎంతో అనుభవం ఉన్న సింగరేణి ఇతర ప్రాంతాల వారికి అవగాహన కోసం సందర్శకులను ఆహ్వానిస్తోంది. రామగుండం ప్రాంతంలో మూసివేసిన జీడీకే 7-ఎల్ఈపీ గనిని సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఆర్టీసీ సంస్థతో ఒప్పందం చేసుకొని హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసింది. బొగ్గు ఉత్పత్తి చేపట్టే విధానంపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. 7-ఎల్ఈపీ గనితో పాటు ఓసీపీ-3, సింగరేణి విద్యుత్తు కేంద్రాన్ని సందర్శనకు ఏర్పాటు చేశారు.

సామాజిక సేవలో భాగస్వామ్యం

బొగ్గు ఉత్పత్తితో పాటు సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతను సైతం నిర్వర్తిస్తోంది. పరిసర గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది. విద్య, వైద్యం, రహదారుల నిర్మాణానికి నిధులు, రామగుండం ప్రాంతంలో విస్తరించి ఉన్న గనుల పరిసర గ్రామాల్లో తాగునీటి శుద్ధి ప్లాంట్లతో పాటు పాఠశాలలకు అదనపు తరగతి గదులను నిర్మిస్తోంది. విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తోంది. గనుల నుంచి వచ్చే నీటిని సాగు కోసం మళ్లించింది. స్వయం ఉపాధికి వృత్తి శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తుంది. వివిధ వృత్తుల్లో ఉన్న వారికి, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తోంది. వీటితో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్లు నిర్మించింది.

# దూది రైతులకు దుఃఖమే!

పెద్దపల్లి : ఒకవైపు సీసీఐ, మరోవైపు అడ్తివ్యాపారుల ఆగడాలకు దూది రైతులు దుఃఖిస్తున్నారు. రెండేళ్ల కిందట క్వింటా పత్తికి రూ.12 వేల వరకు ధర పలకగా ప్రస్తుతం అదే నాణ్యత ఉన్న పత్తి రూ.6,500 కూడా దాటలేని దుస్థితి నెలకొంది. గతేడాది క్వింటా పత్తికి రూ.6,300 మద్దతు ధర ఉంది. ఈ సారి 8 శాతం తేమ ఉంటే రూ.7,020లు, 12 శాతం తేమ ఉంటే రూ.6,720గా ధర నిర్ణయించి భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు చేస్తోంది. ఆయా వ్యవసాయ యార్డుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు కనీస మద్దతు ధర చెల్లించాలని ప్రకటనలే తప్ప వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

నిబంధనలు తూచ్

రైతులు దళారుల బారిన పడకుండా ఆధార్ ప్రామాణీకరణ, బ్యాంకు ఖాతా అనుసంధానం తప్పనిసరి చేశారు. రైతుల వేలిముద్రల సేకరణ, ఓటీపీ తదితర విధానాలను ఏర్పాటు చేసి సీసీఐ ద్వారా పత్తిని విక్రయించుకునే అవకాశం కల్పించారు. సమగ్రంగా చర్యలు ప్రభుత్వం తీసుకున్నప్పటికి దళారులు రైతులను దోచుకోవడంలో కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. సీసీఐ నోటిఫై చేసిన పత్తిమిల్లుల్లో రోజూ వందల క్వింటాళ్ల పత్తిని దళారులు రైతుల పేరుపై స్వేచ్ఛగా విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెద్దపల్లి జిల్లా వ్యవసాయ మార్కెట్‌లోని పత్తియార్డులో తేమయంత్రాలు పని చేయలేదు. మొత్తం 8 యంత్రాలున్నాయని అధికారులు చెబుతున్నప్పటికి వాటిని పక్కన పెట్టేసి చేతి రాతతో తేమశాతాన్ని రాయడం కనిపించింది. తూకం చేసే విషయంలోనూ పత్తిని అధికంగా తేమ, తాలు పేరుతో కోతలు విధిస్తూ అడ్తిదారులు రసీదులపై రాయడం గమనార్హం.ప్రతి పంట కాలం ముందే వ్యవసాయశాఖ అధికారులు రైతుల నుంచి వ్యవసాయ భూమి విస్తీర్ణం, పండించే పంటల వివరాలు నమోదు చేసుకుంటారు. ధాన్యం, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్ల సమయంలో ఆ వివరాల ద్వారా మాత్రమే కొనుగోలు, చెల్లింపులు జరుగుతాయి.ప్రతి మండలానికి సరిపడా వ్యవసాయ అధికారులు లేకపోవడంతో పంట నమోదు పూర్తిస్థాయిలో జరగలేదు. దీన్ని దళారులు అవకాశంగా తీసుకుంటున్నారు. నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసిన విడి పత్తిని వారితో కలిసి సీసీఐ నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లులకు తరలించి అక్కడే విక్రయిస్తున్నారు. సంబంధిత రైతు బ్యాంకు ఖాతాలో జమ చేసిన మొత్తంలో క్వింటాకు రూ.వెయ్యి చొప్పున వారికి చెల్లిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇటు మిల్లుల యజమానులతో పాటు సీసీఐ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు దళారులకు సహకరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కౌలు రైతుల పంట వివరాలు నమోదు చేయకపోవడంతో వారు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు.

దక్కని మద్దతు ధర

జిల్లావ్యాప్తంగా నవంబర్ 1 నుంచి ఇప్పటి వరకు మొత్తం 6,161 మంది రైతుల నుంచి 16.94 కోట్ల విలువైన మొత్తం 26,727 క్వింటాళ్ల మేర పత్తిని కొనుగోలు చేశారు. సీజన్ మొదలైనప్పటి నుంచి ధరలు లేవని, తేమ, తాలు కొర్రీలు విధించడంతో మద్దతు ధర కంటే తక్కువ ధరకే కొనుగోలు చేశారు. ఒక్కరోజు కూడా మద్దతుధరకు కొనుగోలు చేయకపోవడం గమ నార్హం.

రైతులకు అన్యాయం- కొమ్ము తిరుపతి, నారాయణపూర్

మూడు క్వింటాళ్ల మేర పత్తి తెచ్చాను. ఇక్కడికొస్తే 2.5 క్వింటాళ్ల పత్తిని తూకంలో చూపారు. 12 శాతం తేమ ఉండటంతో క్వింటాకు రూ.6,100 మద్దతు ధర నిర్ణయించగా మొత్తం రూ.15,250 చెల్లించాలి. కేవలం రూ.14 వేలు చెల్లించారు. అడ్తికమీషను, హమాలీ ఖర్చులకంటూ కొర్రీలు విధించారు. మార్కెట్‌కు వస్తే దోపిడీ తప్ప రైతులకు ఏం మిగలడం లేదు.

కత్తిరింపులతో దోపిడీ - వేల్పుల సదయ్య, రాగినేడు రైతు

ఈ రోజు మొత్తం ఆరు క్వింటాళ్ల మేర పత్తి తెచ్చాను. 5.58 క్వింటాళ్ల మేర తూకం వేశారు. ఇందుకోసం క్వింటాకు రూ.6,651 ధర చెల్లించారు. ఈ లెక్కన మొత్తం రూ. 37,122 చెల్లించాల్సి ఉండగా రూ.35,920 మాత్రమే చెల్లించారు. అడ్తికమీషను రూ.744, నగదు కత్తిరింపులు పేరిట రూ.458 నగదు నేరుగా ఇచ్చినందుకు వసూలు చేశారు. ఇదేంటని అడిగితే ఇలాగే ఇస్తామని ఖరాఖండీగా చెబుతున్నారు. ఉన్నతాధికారులు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది.

తేమశాతాన్ని బట్టి కొనుగోలు- దశరథం, సీసీఐ అధికారి

వ్యవసాయశాఖ నమోదు చేసిన పంట విస్తీర్ణం మేరకు పండించిన పంటను మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తోంది. కౌలు రైతులకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల వారి నుంచి కొనుగోలు చేయడం లేదు. గరిష్ఠ మద్దతు ధర చెల్లించకపోవడానికి కారణం తేమశాతమే. ఇప్పటివరకు ఏ ఒక్క క్వింటాకు మద్దతు ధర చెల్లించలేదు. మద్దతు ధర లోపే 12 శాతం, అంతకు మించి తేమశాతం ఉన్న పత్తిని కొనుగోలు చేశాం.

నిబంధనల మేరకే...- ప్రవీణ్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి

జిల్లా మార్కెట్‌లో 8 తేమకొలిచే యంత్రాలుండగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. వాటిని మరమ్మతులు చేయిస్తాం. తేమ, తాలు శాతం నిబంధనల ప్రకారమే పరిశీలించి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నాం. కేంద్రాల వద్ద రైతులను ఏరకంగా ఇబ్బంది పెట్టినా వారిపై చర్యలు తీసుకుంటాం. కోతలు, దళారుల ప్రమేయంపై రాతపూర్వక ఫిర్యాదులు మాకు చేస్తే చర్యలు తీసుకుంటాం.

# ఇందిరమ్మతోనైనా.. ఇళ్లు వచ్చేనా?



సిరిసిల్ల: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు అనే నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీనికి సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు ఇంకా రాలేదు. అయితే గత ప్రభుత్వ హయాంలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టింది. పూర్తయిన చోట దశల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీ చేశారు. కొన్ని చోట్ల లబ్ధిదారుల ఎంపిక దశలోనే ఉంది. మరికొన్ని చోట్ల అసంపూర్తి నిర్మాణాలు ఉన్నాయి. టెండర్లు పూర్తయినా గుత్తేదారులు నిర్మాణానికి ముందుకు రాని చోట లబ్ధిదారులను ఎంపిక చేసి వారే నిర్మాణాలు చేసుకునేలా ప్రోత్సహించారు. ఇవి కాకుండా ఇంకా ఇళ్లు లేని నిరుపేదల నుంచి గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులు స్వీకరించింది. గ్రామ సభల్లో అర్హులైన వారిని ఎంపిక చేసి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలకు ప్రొసీడింగ్స్ అందించింది. ప్రభుత్వం మారడంతో ఈ పథకం రద్దు కానుంది. అయితే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై కథనం.

కొత్త ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ప్రారంభించేలా సన్నాహాలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి పథకంలో జిల్లా వ్యాప్తంగా 22,126 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో అధికారులు ప్రాధాన్యత క్రమంలో అర్హులైన 14,645 మందిని గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సిరిసిల్ల, వేములవాడ నియోజక వర్గాలతోపాటు బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో 3,992 మందిని తొలి విడత గుర్తించారు. వీరిలో 2,456 మందికి ప్రొసీడింగ్స్ కూడా అందించారు. అయితే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తే గృహలక్ష్మి దరఖాస్తులన్నీ బుట్టదాఖలు కానున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం కొత్తగా దరఖాస్తులు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది.

రెండు పడక గదులు.. సొంత నిర్మాణాలు

గత ప్రభుత్వం హయంలో జిల్లా వ్యాప్తంగా పలు విడతల్లో 6,886 రెండు పడక గదుల ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 51 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. అందులోనూ సిరిసిల్ల నియోజకవర్గంలోనే ఎక్కువగా ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన వాటిలో దాదాపు పంపిణీ కూడా జరిగింది. అసంపూర్తి నిర్మాణాలు ఉన్న చోట ఎంపిక చేసిన లబ్ధిదారులకే నిర్మాణాలు పూర్తి చేసుకునేలా గుత్తేదారులతో సమన్వయం చేశారు. స్థల సమస్యతో పనులు జరగని చోట కూడా సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేసుకునే విధంగా ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ప్రస్తుతం అలాంటి నిర్మాణాలు అసంపూర్తి దశలో ఉన్నాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో ఎల్లారెడ్డిపేట మండలం పదిర, వీర్నపల్లి మండలంలో నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. తంగళ్లపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో ప్రారంభం కాలేదు. వేములవాడ నియోజకవర్గంతోపాటు బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో ఇంటి నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాలేదు.

వీర్నపల్లి మండలం కంచర్లలో రెండు పడక గదుల ఇళ్లు 13 మంజూరయ్యాయి. గుత్తేదారు పనులు ప్రారంభించి వదిలేశారు. అప్పటికే గ్రామంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా జరిగింది. ఏళ్ల తరబడి జాప్యం జరుగుతుండటంతో లబ్ధిదారులు తమ సొంత డబ్బులతో నిర్మాణాలకు ముందుకొచ్చారు. గుత్తేదారుకు ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను లబ్ధిదారులకు ఇస్తామని అవగాహన చేసుకున్నారు. నిర్మాణాలు పూర్తయ్యే నాటికి ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయనే భరోసాతో ఉన్నారు. ఇప్పటికీ అసంపూర్తి దశలోనే ఉన్నాయి.

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో పది ఇళ్లు మంజూరయ్యాయి. గుత్తేదారు పనులు ప్రారంభించకపోవడంతో ఎంపిక చేసిన లబ్ధిదారులే సొంతంగా నిర్మించుకునేందుకు ముందుకొచ్చారు. ప్రభుత్వం నుంచి డబ్బులు మంజూరయ్యాక నేరుగా చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. నిర్మాణాలు ఇంకా అసంపూర్తి దశలోనే ఉన్నాయి. నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులు బిల్లుల కోసం ఆందోళన చెందుతున్నారు.

# జనవరి 1 నుంచి నుమాయిష్

సిరిసిల్ల: నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శన(నుమాయిష్) జనవరి 1 నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 15 వరకు కొనసాగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సొసైటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సారి సుమారు 2,400 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 80శాతం కేటాయింపు పూర్తవగా, నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గతేడాదికి భిన్నంగా స్టాళ్ల ఏర్పాటుకు మైదానంలో లే-అవుట్ పనులు చక్కగా తీర్చిదిద్దుతున్నారు. ఎగ్జిబిషన్ ప్రవేశ ద్వారాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. ప్రవేశ రుసుము రూ.40 నిర్ణయించారు. సందర్శకుల వాహనాల పార్కింగ్‌కు నగర ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సహకారంతో ఖాళీ స్థలాన్ని ఉచితంగా కల్పిస్తున్నారు. అగ్నిప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. వృద్ధులు, నడవలేని వారికి ఎగ్జిబిషన్ లోపల ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు వాహనాలతో సందర్శించే అవకాశం కల్పిస్తున్నారు. ఈ సారి 25 లక్షలకు పైగానే సందర్శించే అవకాశం ఉందని సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి రాజేందర్ తెలిపారు.

# పాఠశాలల్లో బాలికా సాధికారత క్లబ్‌లు

సిరిసిల్ల : ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి సమయం వచ్చినప్పుడు సమస్యను ఎదుర్కొనే దిశగా తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం బాలికా సాధికారత క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. బాలికలు పాఠశాలకు వచ్చే సమయంలో గానీ, ఇతర సమయాల్లో ఈవ్‌టీజింగ్, అవమానం, లైంగిక వేధింపులు వంటి వాటిని ఎదుర్కొనే విధంగా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. బాలికలు పాఠశాలకు వచ్చే సమయంలో ఎదురయ్యే కష్టాలను బయటకు చెప్పుకోలేని వారి కోసం పటిష్ఠ నిఘా వ్యవస్థను తయారు చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 14 నుంచి క్లబ్బుల ఏర్పాటు ప్రారంభించి పూర్తి చేశారు.

బాలికా సాధికారత క్లబ్బులు ఏర్పాటు చేయడానికి జిల్లాలోని పాఠశాలల్లో వంద మంది కంటే ఎక్కువ విద్యార్థినులు ఉన్న వంద పాఠశాలలను ఎంపిక చేశారు. వాటిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీలను ఎంపిక చేశారు. ప్రతీ పాఠశాలలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఒక్కో తరగతి నుంచి ఇద్దరు క్రియాశీలక బాలికలను లీడర్లుగా నియమించారు. కమిటీకి ఛైర్మన్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సభ్యులుగా బాలికలతో స్నేహపూర్వకంగా ఉండే మహిళా టీచర్ గానీ, ఒక సీనియర్ ఉపాధ్యాయుడు, స్థానిక పోలీసు, షీటీం కానిస్టేబుల్, ఒక వైద్యురాలు ఉంటారు. కమిటీలో ఉన్న ఇద్దరు క్రియాశీలక బాలికలు రోజూ తరగతి గదిలో మానసికంగా బాధపడుతూ మనసులో ఉన్న కష్టాలను చెప్పుకోలేని వారిని గమనించి తెలివిగా వారి నుంచి వివరాలు సేకరిస్తారు. అలా తెలుసుకున్న వివరాలను టీచర్ దృష్టికి తీసుకెళ్లి నేరుగా షీ టీంకు సమాచారం అందిస్తారు. షీటీం వారు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

# కన్ను పడితే మాయమే

తాండూరు: వర్షాకాలంలో ఎగువన కురిసిన వర్షాలకు జిల్లాలోని కాగ్నా, కాకరవేణి నదుల్లో వరద నీరు భారీగా ప్రవహించింది. ఇదే సమయంలో ఇసుక మేటలూ ఏర్పడ్డాయి. ప్రస్తుతం రెండు నదుల్లోనూ వరద ప్రవాహం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. నదిలో ఇసుక మేటలు భారీగా కనిపిస్తున్నాయి. అక్రమార్కులు అదను చూసుకొని రాత్రివేళల్లో యంత్రాలు, టిప్పర్లను వినియోగించి కొల్లగొట్టే అవకాశాలున్నాయి అప్రమత్తం కావాల్సిన అవసరముంది.

లక్షల క్యూబిక్ మీటర్లలో..

జిల్లాలో 60 కి.మీ. పొడవున ప్రవహించే కాగ్నా, కాకరవేణి నదుల్లోని ఇసుక మేటలు లక్షల క్యూబిక్ మీటర్లలో వ్యాపించి ఉన్నాయి. ఒక్కోచోట నదుల ఉపరితలంపై నుంచి 20 మీటర్ల లోతు వరకు మేటలు వేసింది. ఇలా వందల చోట్ల ఇసుక మేటలున్నాయి. కాగ్నానదిలో కోకట్, రసూల్‌పూరు, దోర్నాల, బెన్నూరు, అగ్గనూరు, గోనూరు, వీర్‌శెట్టిపల్లి, జీవన్గి, నారాయణపూరు, ఎల్మకన్య, చిట్టిగణాపూరు, రేగొండి, రుక్మాపూరు, మన్‌సాన్‌పల్లి, క్యాద్గిర.. కాకరవేణి నదిలో విశ్వనాథ్‌పూరు, గోవిందరావుపేట, యాలాల, సంగెం కుర్దు, నాగసముందర్ దగ్గర ఇసుక మేటలున్నాయి. వాటిల్లోని ఇసుక విలువను లెక్కగడితే రూ.కోట్లల్లోనే ఉంటుందని తెలుస్తోంది. నదుల్లోని ఇసుకను కొల్లగొట్టడానికి అక్రమార్కులు వాహనాలతో వెళ్లేందుకు అనేక మార్గాలను



ఎంచుకుంటారు. నదులకు సమీపంలో పంటలు లేక ఖాళీగా ఉన్న పొలాలను రహదారులుగా మార్చుకునే అవకాశాలున్నాయి. వాటిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు అంటున్నారు. చీకటి పడగానే యంత్రాలతో ఇసుక తవ్వి వాహనాల్లో నింపి ఆయా ప్రదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటారు. కొన్నేళ్లుగా ఈ తంతు కొనసాగుతూనే ఉంది. నదుల్లోని ఇసుక మేటలను కొల్లగొట్టేందుకు అక్రమార్కులు అన్ని విధాలా ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

రూ.కోట్లల్లో సంపాదన: ఏళ్లుగా ఇసుకను అక్రమంగా కొల్లగొట్టిన వారు రూ.కోట్లల్లో సంపాదించారు. ఒకప్పుడు అద్దె ట్రాక్టర్లు, లారీలతోనే ఇసుక రవాణా చేసిన వీరు సొంతంగా వాహనాలు, యంత్రాలు కొన్నారు. తాండూరులో విలువైన స్థలాల్లో భవంతులు నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కో ట్రాక్టరు ఇసుకను విక్రయించడం ద్వారా రోజూ రూ.4- 5 వేలు సంపాదిస్తున్నారు. ప్రభుత్వానికి మాత్రం నయాపైసా ఆదాయం సమకూరడం లేదు. లారీ ఇసుకను విక్రయించడం ద్వారా రూ.15- 25 వేలు సంపాదిస్తున్నారు. ఇలా నిత్యం ట్రాక్టర్లు, లారీల ద్వారా భారీగా తరలిస్తున్నారు. నదుల్లోని ఇసుకను కొల్లగొట్టకుండా అధికారులు ఎక్కడికక్కడ కట్టడి చేయాల్సిన అవసరముందని స్థానికులు అంటున్నారు.

# యంత్రలక్ష్మి కనికరించేనా?

పరిగి : వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. డ్రోన్ల సాయంతో పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. సాంకేతికంగా ఇంతగా అభివృద్ధి చెందుతున్నా రాయితీ సదుపాయాలు లేకపోవడంతో పేద రైతులకు ఇవి అందని ద్రాక్షగానే మారుతున్నాయి. జిల్లా గ్రామీణ ప్రాంతం కావడంతో సాంకేతికత ఇంకా వారి చెంతకు చేరడం లేదు. పాత పద్ధతుల్లోనే సాగు చేస్తూ అష్టకష్టాలు పడుతున్నారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా కొందరు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా పండ్ల తోటలపై దృష్టి సారించారు. కూలీల సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లుగా రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

53 వేల ఎకరాల్లో సాగు

జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో పండ్ల తోటలు, కూరగాయలు కలిపి 53,132 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్నాయి. రెండో పంటగా కూరగాయల సాగుకు మరో 12,104 ఎకరాలు అందుబాటులోకి రానుంది. భూగర్భ జలాలు మరింత లోతుగా పడిపోతే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని అధికారుల అంచనా.

6,600 మంది రైతుల నిరీక్షణ

5,639.66 ఎకరాల్లో సాగుకు బిందు సేద్యం పరికరాల కోసం 4,985 మంది, 1,492 ఎకరాల్లో సాగు కోసం తుంపర పరికరాలకు 1,616 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. పదేళ్లయినా యాంత్రీకరణ పరికరాలు ఊసే లేదు. దీంతో కూలీల ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రోజు కూలీ రూ.800కుపైగా



వెచ్చించాల్సి వస్తోందని, పరికరాలైతే ఒకే కూలీతో నాలుగెకరాల వరకు నీటిని అందించేందుకు వీలుందని, ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. యాంత్రీకరణకు రైతుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉన్నా సకాలంలో అందకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. రెండు శాఖలకు నిధుల కేటాయింపు లేకపోవడంతో అవి నిస్తేజంగా తయారయ్యాయి.

పొదుపే ప్రధానం

నీటి సమస్యను అధిగమించే క్రమంలో వ్యవసాయ క్షేత్రాల్లోనూ రైతన్నలు ఇంకుడు గుంతలను తవ్వుకున్నారు. ఇందుకు ఉపాధిహామీ పథకం వరంగా మారింది. అవగాహనా లోపంతో చాలామంది ఇంకా ముందుకు రావడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రోత్సహిస్తే మరిన్ని ఫలితాలు వస్తాయి. ప్రస్తుతం విపణిలో తుంపర పరికరాల సెట్టు ధర రూ.25వేలకు పైగా పలుకుతోంది. వీటి కొనుగోలు అన్నదాతలకు ఆర్థికంగా భారంగా మారింది. రాయితీపై అందించే పరికరాలు రూ.6వేలలోపే దొరుకుతాయి. దీంతో ఎప్పుడెప్పుడు పరికరాలు అందుతాయా.. అని ఆశగా ఎదురుచూస్తున్నారు. సాగుకు సరైన సమయం ఇదేనని, మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచిస్తున్నా తగిన ప్రోత్సాహం మాత్రం అందడం లేదని ఆందోళన చెందుతున్నారు.

మంజూరయ్యే అవకాశముంది..: చక్రపాణి, జిల్లా ఉద్యానాధికారి

బిందు, తుంపర పరికరాల కోసం రైతుల నుంచి డిమాండ్ విపరీతంగా ఉంటోంది. గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఈసారి మంజూరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యాన పంటలవైపు రైతులు ఆసక్తి చూపడం ఆహ్వానించదగ్గ పరిణామం.

# అదుపు లేని వేగం.. అంతులేని మోసం



హైదరాబాద్: శాంతిభద్రతలు, సైబర్, ఆర్థిక నేరాలు, మహిళల భద్రత, డ్రగ్స్ తదితర నేరాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రంలో జరిగిన 'నగర పోలీసు వార్షిక నివేదిక 2023' విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఈ ఏడాది సైబర్ నేరాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయని. బాధితులు రూ.133 కోట్ల మేర సొమ్ము పోగొట్టుకోగా.. వీరిలో పెట్టుబడుల మోసంలో ఎక్కువగా రూ.84 కోట్లకు పైగా నష్టపోవటం గమనార్హం.: ఈ ఏడాది నేరాలతోపాటు రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. మద్యం మత్తు, మితిమీరిన వేగంతో అధికశాతం మృత్యువాత పడ్డారు. కొత్త సంవత్సరంలో రహదారి ప్రమాదాల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ అదనపు సీపీ పి.విశ్వప్రసాద్ తెలిపారు. 2014లో 42.20లక్షల వాహనాలు 2023 అక్టోబరు 31 నాటికి 83.5 లక్షలకు చేరాయి.

మత్తు ముఠాలను వెంటాడుతాం..

యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ ముఠాలను వెంటాడతాం. సీనియర్ పోలీసు అధికారులు, రైల్వే, ఎక్సైజ్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ మత్తుకు అడ్డుకట్ట వేస్తాం. మాదకద్రవ్యాలను గుర్తించేందుకు స్నిఫర్ డాగ్స్‌ను వినియోగిస్తున్నాం. కొత్త గాడ్జెట్స్‌ను ఉపయోగిస్తాం. ఈ ఏడాది టీఎస్‌న్యాబ్ 83 కేసుల్లో 241 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 120 మందిని వినియోగదారులుగా నిర్ధారించి పునరావాస కేంద్రానికి పంపాం.

ఆర్థిక నేరాల అదుపునకు చర్యలు

ఆర్థిక నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటాం. భూములు కొట్టేసేందుకు తప్పుడు పత్రాలు సృష్టిస్తే ఊరుకోబోం. భూ వివాదం, సివిల్ అంశాల్లోనూ పోలీసు ప్రమేయం ఉంటే జోక్యం చేసుకుంటాం. ఈ ఏడాది 9,150 కోట్లకు పైగా ఆర్థిక/మోసాల బారినపడి జనం నష్టపోయారు. భూ వివాదాలు/ఆర్థిక సంబంధాల అంశాల్లో కేసులు, శిక్షలు తదితర అంశాలపై అవగాహన కల్పించేలా సిబ్బందికి శిక్షణనిస్తాం. నేరాల కట్టడికి ప్రయోగించే పీడీయాక్ట్ పక్కాగా అమలు చేస్తాం.

నయాసాల్.. పక్కా రూల్స్

కొత్త సంవత్సరం వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని నగర సీపీ స్పష్టంచేశారు. డిసెంబరు 31 అర్ధరాత్రి 1గంట వరకు మాత్రమే సంబరాల నిర్వహణ, పాల్గొనేందుకు నిబంధన విధించామన్నారు. అర్ధరాత్రి 12.45 గంటలకు కార్యక్రమాలు పూర్తిచేసుకొని ఇంటిదారి పట్టాలన్నారు. సాధారణ ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై కేక్‌కటింగ్, వాహనాలతో ర్యాలీలు నిర్వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10వేల జరిమానా, 6 నెలల జైలుశిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్ తప్పవన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన రాకపోకల సమయంలో చాలా తక్కువ సమయం వాహనాలు నిలిపేలా జాగ్రత్త తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

బిగ్‌బాస్ నిర్వాహకులకు త్వరలో నోటీసులు..

బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌పై కేసు నమోదు వెనుక ఎటువంటి తప్పిదం లేదని సీపీ శ్రీనివాసరెడ్డి స్పష్టంచేశారు. విజేతగా ప్రకటించాక పల్లవి ప్రశాంత్‌ను ఊరేగింపుగా వెళ్లొద్దని పోలీసులు సూచించారని పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ వివరించారు. బయట అభిమానులు గుంపుగా ఉండటంతో వెనుక మార్గం నుంచి పంపించామన్నారు. ఆ తరువాత ఊరేగింపుగా బయటకు వచ్చిన ప్రశాంత్ రెచ్చగొట్టేలా ప్రవర్తించడంతో గొడవలు జరిగాయన్నారు. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు కూడా ధ్వంసమైనట్లు తెలిపారు. గొడవలు ప్రేరేపించినందుకే అతడితో సహా 16 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. శాంతిభద్రతల సమస్యకు కారణమైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామన్నారు. బిగ్‌బాస్ నిర్వాహకులకు త్వరలో నోటీసులు జారీచేస్తామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రవర్తిస్తే రైతుబిడ్డ, మరెవరైనా ఇదే విధంగా చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు.

# తాండూరు కంది.. లాభాలకు నాంది



తాండూరు : జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాగైన కంది పంట ఆశాజనకంగానే ఉంది. అక్టోబరులో కురిసిన వర్షాలు పంట ఎదుగుదలకు దోహదం చేశాయి. ఈ నేపథ్యంలో దిగుబడులు ఆశించిన స్థాయిలోనే వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ముందస్తుగా విత్తనాలు వేసిన పంట దిగుబడులను రైతులు విపణుల్లో విక్రయించి మద్దతుకు మించి ధర పొందుతున్నారు.

1.51 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లావ్యాప్తంగా రైతులు వానాకాలం సీజన్‌లో 1,51,824 ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. చెల్క, రేగడి పొలాల్లో నేల సారాన్నిబట్టి దిగుబడులు వస్తున్నాయి. చెల్క పొలంలో ఎకరాకు 3- 5 క్వింటాళ్లు, రేగడి పొలాల్లో 5-7 క్వింటాళ్ల చొప్పున దిగుబడులు వస్తున్నాయి. మొత్తం సాగులో ఉన్న పంటల నుంచి 4.55 లక్షల నుంచి 10.62 లక్షల క్వింటాళ్ల దిగుబడులు వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

మద్దతుకు మించి

జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, మర్పల్లి, ధారూర్, కుల్కచర్ల, కోట్‌పల్లి, కొడంగల్, బషీరాబాద్ విపణుల్లో అమ్ముతున్న కందులకు మద్దతుకు మించిన ధర లభిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2023-24 వానాకాలం సీజన్‌లో క్వింటాలు కంది పంటకు రూ.7వేలు మద్దతు ధరను ప్రకటించింది. విపణిలో మాత్రం వ్యాపారులు అంతకంటే ఎక్కువ ధరకు కొంటున్నారు. క్వింటాలుకు గరిష్ఠ ధర రూ.9,819, కనిష్ఠ ధర రూ.7,811, సగటు ధర రూ.9,789 చొప్పున లభిస్తోంది. ఈ లెక్కన ఒక్కో క్వింటాకు రైతులు రూ.811 నుంచి రూ.2,789 చొప్పున లాభపడుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో క్వింటాలు కందులకు రూ.6,600 ఉంటే ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రం రూ.400 పెంపుతో రూ.7వేల వరకు మద్దతు ధర పెరిగింది. దేశీయంగా కందులకు ఎక్కువగా డిమాండ్ ఉండడంతో ప్రస్తుతం విపణిలో పలుకుతున్న ధరలు మరింత పెరిగి రైతులకు ఆర్థికంగా లాభించవచ్చని కొనుగోలుదారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో రైతులు ఇప్పటి వరకు 3వేల క్వింటాళ్ల కందులను మద్దతు ధరకు మించి విక్రయించారు.

పక్క రాష్ట్రానికి ఎగుమతి..

తాండూరు విపణిలో కందులను కొంటున్న వ్యాపారులు ఏపీలోని మిల్లర్లకు ఎగుమతి చేస్తున్నారు. నరసరావుపేట, గుంటూరు, పిడుగురాళ్ల, మాచర్ల వంటి ప్రాంతాలకు వెళుతున్నాయి. ఏపీలో డిసెంబరు, జనవరి నెలల్లో కంది దిగుబడులు చేతికి రావు. దీంతో వారు తాండూరు కందులపై ఆధారపడతారు. ఫిబ్రవరి నుంచి ఏపీకి ఎగుమతులు మందగించగానే వ్యాపారులు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడుకు ఎగుమతి చేస్తారు.

ఇవి నాణ్యమైన కందులు: రాజేశ్వరి, విపణి కార్యదర్శి

తాండూరు విపణికి విక్రయానికి వచ్చే కందులు నాణ్యమైనవి కావడంతో వ్యాపారులు ఎక్కువ ధరకు కొంటున్నారు. మద్దతు ధర కంటే ఎక్కువ లభించడం రైతులకు ఆర్థికంగా కలిసివస్తోంది. జనవరి తృతీయార్థం నుంచి విపణిలో ఉత్పత్తుల అమ్మకాలు ఎక్కువగా ఉండబోతున్నాయి.

ఆశాజనకంగా దిగుబడులు

జిల్లాలో కంది పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. పంటలు ఎండిపోయే స్థితిలో ఉండగా.. అక్టోబరులో కురిసిన వర్షాలు జీవం పోశాయి. దిగుబడులు రావడానికి కారణమయ్యాయి. చెల్క పొలాల్లో ఎకరాకు 3- 5, రేగడి పొలాల్లో 5- 7 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావొచ్చని అంచనా వేస్తున్నాం.డా.సుధాకర్, సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త, తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం

# గ్యాస్ కనెక్షన్లు ఎన్ని?..అర్హులను ఎలా గుర్తించాలి..?

హైదరాబాద్: మహాలక్ష్మి పథకం అమలు కోసం కసరత్తు మొదలైంది. గ్యాస్ కనెక్షన్ల లెక్కలు తేల్చిన అనంతరం అర్హుల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నారు. మూడు జిల్లాల్లో ప్రాంతాల వారీగా గ్యాస్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయో లెక్కలు చెప్పాలంటూ పౌర సరఫరాలశాఖ కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రాంతాల వారీగా ఖాతాదారుల వివరాలు సమర్పించాలని హెచ్‌పీ, బీపీసీఎల్, ఐవోసీఎల్ సంస్థలకు పౌరసరఫరాలశాఖ అధికారులు లేఖలు రాశారు. వివరాలు అందిన వెంటనే ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులను గుర్తించనున్నారు.గ్రేటర్‌లో 40లక్షల కనెక్షన్లు..కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం అమలుకు వడివడిగా అడుగులు వేస్తోంది. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించాలనే లక్ష్యంతో.. వినియోగ దారుల చిరునామాతో పాటు బ్యాంకు ఖాతా వివరాలను సీడీ రూపంలో అందజేయాలని హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి బాలమాయాదేవి అధికారులను ఆదేశించారు. ఆయిల్ కంపెనీల లెక్కల ప్రకారం.. గ్రేటర్ పరిధిలో 40లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ లెక్కన ప్రతినెలా ప్రభుత్వంపై రూ.122కోట్ల భారం పడుతుంది. ఎగువ,



మధ్యతరగతి, ఉన్నత వర్గం వారిని మినహాయిస్తే ప్రతినెలా రూ.100 కోట్ల మేర భారం పడుతుందని ఏజెన్సీల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. అమలుకు ముందే ఆరాలు..: మహాలక్ష్మి పథకం అమలుకు ముందే ప్రజల నుంచి అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయని గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు చెబుతున్నారు. అర్హుల ఎంపిక ఎలా ఉండబోతోంది..? మహిళల పేరు మీద ఉన్న వాటికే అమలు చేస్తారా..? అంటూ ప్రశ్నిస్తున్నారు. విధివిధానాలపై ఎలాంటి స్పష్టత లేదని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.

# ఎకరాల్లో ఆక్రమించి.. గజాల్లో విక్రయించి

హైదరాబాద్: అది అక్షరాలా రూ.1000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి. శంషాబాద్ విమానాశ్రయానికి ఆనుకుని ఉన్న ఈ భూమిని కొంతమంది అక్రమార్కులు సొంతం చేసుకుంటున్నారు. నిర్మాణాలు చేపట్టి గజాల చొప్పున విక్రయించి రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కొంతమంది రైతులను కూడా అక్కడి రియల్టర్లు బెదిరిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం రెవెన్యూ అధికారులకు తెలిసే జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. కొందరు కిందిస్థాయి అధికారులకు అమ్యామ్యాలు ముట్టజెప్పడంతో ఈ అక్రమాలకు తోడ్పాటు అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీనిపై ప్రతినిధి దృష్టిసారించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం చిన్నగోల్కొండ పరిధిలోని సయ్యద్‌గూడ రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 24లో 212 ఎకరాలు, 25లో 14.20 ఎకరాలు మొత్తం 226.20 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. పెద్దగోల్కొండ, గొల్లపల్లి గ్రామాలకు చెందిన 98 మంది రైతులకు సర్వే నెంబర్ 24లోని 212 ఎకరాల్లో 100 ఎకరాలను కొన్నేళ్ల కిందటే ప్రభుత్వం ఎసైన్డ్ భూములుగా కేటాయించింది. ఈ భూముల్లో సంబంధిత రైతులు ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఈ భూములను విక్రయించకూడదు. 2005లో విమానాశ్రయం రావడంతో సయ్యద్‌గూడ భూములకు బాగా డిమాండ్ వచ్చింది. దీంతో రియల్టర్ల కన్ను ఈ వందెకరాల భూమిపై పడ్డాయి. కొన్నేళ్లుగా ఇక్కడి రైతులకు అంతో ఇంతో ఇచ్చి కొన్ని భూములను కొందరు సొంతం చేసుకున్నారు. ఈ భూముల క్రయవిక్రయాలు జరగకుండా రెవెన్యూ అధికారులు నిషేధిత జాబితాలో నమోదు



చేశారు. ధరణి పోర్టల్ రాకముందు ఈ భూములను శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ధరణిలో ఈ భూములు నమోదు కాకపోవడంతో తాజాగా రిజిస్టర్ కావడం లేదు. దీంతో గజాల చొప్పున విక్రయించడానికి ఎత్తుగడ వేస్తున్నారు. రియల్టర్లు కొనుగోలు చేసిన ఎసైన్డ్ భూముల్లో గదుల నిర్మాణం చేపట్టి ఇంటి నంబరు, విద్యుత్తు మీటర్లు బిగించారు. ఈ ఎసైన్డు భూమి పక్కనే మరో 50 ఎకరాల సర్కారు స్థలం ఉంది. దానినీ కబ్జా చేశారని స్థానికులు చెబుతున్నారు. దీనికి కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిసింది.

రైతులకు బెదిరింపులు..: ఇంకా రైతుల దగ్గర కొంత భూమి ఉంది. వీటిని అమ్మాలంటూ రైతులను కొందరు రియల్టర్లు, ప్రజాప్రతినిధులు తీవ్ర స్థాయిలో బెదిరిస్తున్నారు. రైతులకు ఎంతోకొంత ముట్టజెప్పి ఎసైన్డ్, ప్రభుత్వ భూములను తమ ఆధీనంలోకి తీసుకుని గజాల చొప్పున విక్రయిస్తుండడంతో స్థానికంగా కలకలం రేగుతోంది. ఈ భూదందాపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

నిర్మాణాలను కూల్చివేస్తాం

సయ్యద్‌గూడ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, ఎసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇక్కడి ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. నిషేధిత భూములను క్రయవిక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేస్తాం.నాగమణి, తహసీల్దార్, శంషాబాద్

# వాహనదారులకు తగ్గింపు ఊరట

కరీంనగర్ : వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. రవాణా నిబంధనలను విస్మరించిన వారికి జరిమానాల చెల్లింపు విషయంలో ప్రకటించిన డిస్కౌంట్ వరంగా మారబోతోంది. గత కొన్ని నెలలుగా వాహనదారులు పలు రకాల ఉల్లంఘనలకు పాల్పడిన సందర్భాలున్నాయి. శిరస్త్రాణం ధరించకపోవడం మొదలు రాంగ్‌పార్కింగ్, అతివేగంగా ప్రయాణించడం, ధ్రువపత్రాలు సరిగ్గా లేకపోవడంతో ఎక్కడికక్కడ పోలీసులు వారిపై కేసులు నమోదు చేస్తూనే జరిమానాలను చలాన్ల రూపంలో విధించారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పోలీసు శాఖ ఖజానాకు ఆదాయం వీటి రూపంలో సమకూర్చాల్సి ఉంది. గతేడాది మార్చి నెలలోనూ ఇదే తరహా అవకాశాన్నివ్వడంతో చాలామంది పేరుకుపోయిన బకాయిలు చెల్లించారు. తాజాగా 2022 జనవరి నుంచి ఈ ఏడాది డిసెంబరు 22వ తేదీ వరకు ఉన్న పెండింగ్‌లను చెల్లించే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లాభదాయకంగా మారుతోంది. ద్విచక్రవాహనంపై 80 శాతం, కార్లకు, ఆటోలకు 60 శాతం, లారీలు, ఇతర భారీ వాహనాలకు 50 శాతం తగ్గింపును ఇవ్వడంతో ఆర్థిక భారం తగ్గేవీలుంది. ఈనెల 26వ తేదీ నుంచి జనవరి 10 వరకు గడువు ఉండటంతో ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని పలువురు ఆశిస్తున్నారు.

రూ.44.35 కోట్లకుపైగా..



2022 జనవరి ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది డిసెంబరు 22 వరకు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భారీగానే వివిధ రకాల చలాన్లను పోలీసులు విధించారు. మొత్తంగా 14,82,275 కేసులకు సంబంధించి రూ.44,35,14,995 జరిమానా విధించారు. వివిధ సందర్భాల్లో పలువురు చలాన్ల భారం వాహనాలపై ఉండకూడదనే ఉద్దేశంతో చెల్లించారు. ఇలా రెండేళ్ల వ్యవధిలో 9,39,038 కేసులకు సంబంధించి రూ.29,04,73,525 ఖజానాకు ఆదాయంగా మారింది. మిగతా 5,43,237 కేసులకు సంబంధించిన రూ.15,30,41,470లు మాత్రం బకాయిగా ఉన్నాయి. రూ.15 కోట్ల జరిమానాల విషయంలోనే వాహనదారులు ఈ రాయితీని ఉపయోగించుకునే అవకాశముంది. 2022కు ముందు కూడా కొంతమంది మొండి బకాయిలుగా జరిమానాకు సంబంధించిన మొత్తాన్ని చెల్లించలేదు. అవి కలిపితే ఈ మొత్తం మరింతగా పెరిగే అవకాశముంది. సర్కారు తాజాగా నిర్ణయంతో కరీంనగర కమిషనరేట్ పరిధిలో 9.39 లక్షల మందికి సంబంధించి రూ.15 కోట్లకుపైగా మొత్తం వసూలవనున్నాయి.

# నిఘా నేత్రాలపై నిర్లక్ష్యం

సుల్తానాబాద్: దొంగతనాలు, రహదారి ప్రమాదాలు, అక్రమ రవాణా తదితర నేర ఘటనలకు సంబంధించి నిందితులను త్వరగా గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. అయితే ఆర్భాటంగా ఏర్పాటు చేస్తున్న నిఘా నేత్రాలు కొద్దికాలానికే మూలన పడుతున్నాయి. దీంతో లక్ష్యం నెరవేరడం లేదు.
స్థానికుల సహకారంతో సుల్తానాబాద్ పట్టణంలోని ముఖ్య కూడళ్లలో పోలీసుల ఆధ్వర్యంలో సుమారు 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది వర్షాకాలంలో పిడుగు పడి పలు కెమెరాలను అనుసంధానించే విద్యుత్తు పరికరాలు కాలిపోయాయి. మరమ్మతుకు నోచుకోక మూడు నెలలుగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. కెమెరాలను ఠాణాకు అనుసంధానించలేక, నిర్వహణ లేక అలంకారప్రాయంగా మారాయి. రానున్న ఎన్నికల దృష్ట్యా సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలం చెల్లిన పరికరాలు

పట్టణంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వారంటీ ముగియడంతో నిర్వహణ భారంగా మారింది. పాడయిన వాటికి మరమ్మతు చేయించక వృథాగా మారాయి. మరికొన్నింటిని ఠాణాకు



అనుసంధానించక నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో దొంగతనాలు వంటి ఘటనలు జరిగినప్పుడు సీసీ ఫుటేజీలు అందుబాటులో లేక కేసుల ఛేదన ఆలస్యమవుతోంది.

సీసీ ఫుటేజీలే కీలకం

రానున్న ఎన్నికల దృష్ట్యా అభ్యర్థులు, నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రలోభాల పంపిణీకి తెర తీసే అవకాశం ఉంది. ఈ క్రమంలో సీసీ కెమెరాలకు మరమ్మతు చేసి వినియోగంలోకి తేవడంతో పాటు ఠాణాకు అనుసంధానిస్తే బాగుంటుంది. పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న ఘటనలను పోలీసులు ఠాణా నుంచే పర్యవేక్షించడంతో పాటు నియంత్రించే అవకాశం ఉంది.

త్వరలోనే మరమ్మతు చేయిస్తాం

వర్షాకాలం పిడుగుపాటుతో పలు సీసీ కెమెరాలను అనుసంధానించే విద్యుత్తు పరికరాలు పాడయ్యాయి. త్వరలోనే మరమ్మతు చేయించి అన్ని పరికరాలను వాడుకలోకి తెస్తాం.
విజేందర్, సుల్తానాబాద్ ఎస్సై

# నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

జగిత్యాల : పల్లెలను పరిశుభ్రంగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించడమే కాకుండా జాతీయ స్థాయిలో అవార్డులు కూడా అందించి ప్రోత్సహించింది. ప్రజారోగ్యంతోపాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చే దిశగా పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలు చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వాటి ద్వారా కంపోస్టు ఎరువు తయారు చేయాల్సి ఉండగా పంచాయతీలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. పంచాయతీలలో అదనంగా కార్మికుల నియామకం చేపట్టేందుకు నిబంధనలు అడ్డురావడం, లక్ష్యం చేరుకోవడం ఇబ్బందిగా మారుతోంది. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు విద్యుత్తు, ట్రాక్టర్ బకాయిలకే సరిపోతున్నాయి. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం పల్లెప్రగతిలో ట్రాక్టర్లు కొనుగోలు చేసింది. తడి, పొడి చెత్తను వేసేందుకు ఇంటింటికీ రెండు చొప్పున చెత్తబుట్టలు పంపిణీ చేసింది. సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు కంపోస్టు షెడ్డుకు తరలించాలి. తరువాత ప్లాస్టిక్, గాజు, ఇనుము, రబ్బరు తదితర వస్తువులను వేరుచేసి అక్కడే నిర్మించిన అరల్లో నిల్వ చేయాలి. ప్లాస్టిక్ పునర్వినియోగానికి పంపించాలి. అయితే ఇందుకు ఎరువు తయారీ ప్రక్రియ సక్రమంగా జరగాలంటే నిరంతర పర్యవేక్షణ అవసరం. కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు ఈ దిశగా దృష్టి పెట్టాలి. చాలా చోట్ల ఇది జరగటం లేదు. ఉన్నతాధికారుల పర్యటించే సందర్భంలో పరిశీలించే అవకాశం ఉందని, కొన్ని



పంచాయతీలు ఎరువు తయారు చేస్తున్నట్లు నమ్మించే ఏర్పాట్లు చేస్తున్నారు. చిత్త శుద్ధితో అమలు చేసి కంపోస్టు షెడ్ల ఏర్పాటు ఉద్దేశం నెరవేరేలా చూడాల్సి ఉండగా కొన్ని చోట్ల ఎరువు తయారీని అదనపు భారంగా భావిస్తున్నారు. నిత్యం ట్రాక్టర్లలో చెత్త తరలించడం ఇంధన ఖర్చులు భారంగా మారడంతో చిన్న పంచాయతీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.

బంధనలు అడ్డంకి

పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన కార్మికుల నియామకాలు చేపట్టి వేతనాలు అందించాలన్న నిబంధనలు ఉండడంతో పూర్తి స్థాయిలో అమలు చేయడం కష్టంగా మారుతోంది. చిన్న పంచాయతీలలో ఇబ్బందిగా ఉండడంతో పనులన్నీ ఒక్కరే చేయాల్సిన పరిస్థితి. ఒక్కో కార్మికుడు చెత్త తరలింపుతోపాటు పంచాయతీ ట్రాక్టర్ నడిపించడంతోపాటు గ్రామంలోని అవసరాలన్నీ చూసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల ప్రత్యేకంగా కంపోస్టుషెడ్లలో చెత్తను వేర్వేరు చేసే ప్రక్రియ సాధ్యం కావడంలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు విద్యుత్తు బిల్లులు, ట్రాక్టర్ వాయిదా కిస్తీలు చెల్లించడానికే సరిపోతుండగా, పంచాయతీలకు అదనపు ఆదాయ వనరులు సమకూరకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. పంచాయతీలు అదనపు ఆదాయ వనరులు సమకూర్చుకునేలా దృష్టి సారించడమే కాకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినప్పుడే లక్ష్యం నెరవేరుతుంది.

# పత్తి సేకరణ ప్రారంభం



సిరిసిల్ల: పత్తిపంట చేతికందుతోంది. ఈ సీజన్‌లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో జిల్లాలో 50 వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. దీని ద్వారా 3.20 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని మార్కెటింగ్‌శాఖ అంచనా. రెండేళ్లుగా జిల్లాలో పత్తిసాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఈసారి పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7,020గా ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధరకు తక్కువగా ఉంటే భారత పత్తి సంస్థ (సీసీఐ) కేంద్రాల ద్వారా కొనుగోలుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికలు చేస్తోంది. దీనిపై ఇప్పటికే సమన్వయ సమావేశం జరిగింది. ఈసారి కొనుగోళ్లను పక్కా ప్రణాళికతో నిర్వహించేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.

జిన్నింగ్ మిల్లులే సీసీఐ కేంద్రాలు!

ఈ సీజన్‌లో పత్తి విత్తుకునే సమయంలో అనావృష్టి.. ఎదుగుదలలో అతివృష్టి పరిస్థితులు నెలకొన్నాయి. మొక్కల ఎదుగుదల.. పూత, కాయలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. జిల్లాలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, కోనరావుపేట, బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో తొలి దశ పత్తిని తీస్తున్నారు. నవంబరులో పూర్తిస్థాయిలో పత్తి చేతికందుతుంది. పత్తి కొనుగోలుకు పెద్ద మార్కెట్ అయిన జమ్మికుంటలో శనివారం నాడు క్వింటా పత్తి గరిష్ఠంగా రూ.7,150 పలికింది. దీనిలో కొత్త పత్తి రూ.7,000 లు ఉండగా పాత పత్తి రూ.6,800లు. జిల్లాలో మార్కెట్ యార్డు వసతి లేకపోవడంతో జిన్నింగ్ మిల్లుల్లోనే సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సీసీఐ సిబ్బంది నియామకం కూడా పూర్తయింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తేమశాతం 20-30 శాతంగా ఉంటుంది. మద్దతు ధర పొందాలంటే 8 నుంచి 12 శాతం మధ్య ఉండాలి. 8 శాతం తేమ ఉంటే గరిష్ఠంగా క్వింటాకు రూ.7,020 ధర చెల్లిస్తారు. తేమశాతం పెరిగిన కొద్ది ధర తగ్గుతూ వస్తుంది. చివరగా 12 శాతం ఉంటే రూ.6,739 చెల్లిస్తారు. బహిరంగ మార్కెట్‌లో దీనికి భిన్నంగా ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో గతేడాది మద్దతు ధరకు మించి ఉండటంతో రైతులు పూర్తిగా వ్యాపారులకే విక్రయించారు. సీసీఐ నామమాత్రంగా 600 క్వింటాళ్లు కొనుగోలు చేసింది.

బయోమెట్రిక్‌ఈ వానాకాలం జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం రైతుల వివరాలతో వ్యవసాయశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసింది. వాటిని మార్కెటింగ్‌శాఖ సేకరించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచారు. వీటిని సీసీఐ కొనుగోలు కేంద్రంలో ఫింగర్ ప్రింట్, ఐరిస్ స్కానర్‌లతో అనుసంధానం చేస్తారు. ఈ కేంద్రాల్లో పత్తి విక్రయానికి తీసుకొచ్చే రైతుల వివరాలు అందులోనే ఉంటేనే కొనుగోలు జరుగుతాయి. జిల్లాలో కౌలురైతులు, పట్టా పాస్‌పుస్తకం లేని గిరిజనుల రైతులు సాగుచేసిన పత్తి విక్రయానికి ఇబ్బందులు ఎదురవుతాయి. దీనికోసం ఏఈవోలతో ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. ఆ వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేశాక కొనుగోలు జరుగుతాయి. దీని ద్వారా దళారులు సీసీఐకి విక్రయించి అక్రమాలకు పాల్పడడానికి కట్టడి చేస్తారు.

దూరాభారం

జిల్లాలోని వేములవాడ మండలంలో మూడు, ఇల్లంతకుంటలో రెండు, బోయినపల్లిలో ఒకటి మొత్తం ఆరు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్కెటింగ్‌శాఖ ప్రణాళికలు చేసింది. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి, రుద్రంగి, చందుర్తి మండలంలోని చాలా గ్రామాలకు ఈ మిల్లులకు రావాలంటే 30 కిలోమీటర్ల దూరం. తీరా తీసుకొచ్చాక మిల్లుల నిర్వాహకులు తక్కువ ధరలు చెప్పడం.. రవాణా భారంతో చాలా వరకు రైతులు గ్రామాల్లోనే విక్రయించేందుకు మొగ్గు చూపుతారు. గతేడాది వ్యాపారులు గ్రామాల్లోని సేకరించిన పత్తిని ఎక్కువగా మహారాష్ట్రకు తరలించారు. ఫలితంగా స్థానికంగా ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తి లేక జనవరి, ఫిబ్రవరిలోనే మూతపడ్డాయి. మార్కెటింగ్ శాఖలో సిబ్బందిలేమి.. చెక్‌పోస్టుల నిర్వహణలేక ఈ పరిస్థితి ఎదురవుతోందని జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ఏడాది పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది.

గ్రామంలోనే విక్రయిస్తాం- ఎల్లయ్య, అల్మాస్‌పూర్, రైతు

మాకు పత్తి మార్కెట్ అందుబాటులో లేదు. జిన్నింగ్ మిల్లులకు తీసుకెళ్లాలంటే రవాణా ఛార్జీలు ఎక్కువ. తీరా తీసుకెళ్లాక ధర గిట్టకపోతే తిరిగి తీసుకురాలేని పరిస్థితి. అందుకే గ్రామాలకు వచ్చే వారికే విక్రయిస్తూ ఉంటాం. గతేడాది బహిరంగ మార్కెట్‌లో ధరల పెరిగినా గ్రామంలో క్వింటాకు రూ.6,500 చొప్పున విక్రయించాం. ఈ ఏడాది మూడెకరాల్లో పత్తిసాగు చేశాను. ఇప్పటికీ 8 క్వింటాళ్ల వరకు పత్తిని సేకరించాం.

త్వరలోనే ప్రారంభిస్తాం- ప్రవీణ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

జిల్లాలో ఇప్పుడిప్పుడే పత్తి సేకరణ జరుగుతోంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటు, వాటిలో కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టేందుకు సన్నాహాలు పూర్తి చేశాం. త్వరలోనే ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులు తప్పనిసరిగా ఆధార్‌తో అనుసంధానం చేసిన చరవాణి నంబరు, బ్యాంకు ఖాతా నంబరుతో సీసీఐ కేంద్రాలకు రావాలి. ఒకవేళ వెబ్‌సైట్‌లో పేర్లులేని వారు ఉంటే ఏఈవోలచే ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. కేంద్రంలో రైతుల వివరాలు నమోదు చేసి కొనుగోలు చేస్తాం.

# శివారుపై చిన్న చూపు !

రాయికల్ :పురపాలికల్లోని శివారు కాలనీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగుకాల్వలు, సీసీరహదారులు, వీధి దీపాలు లేక కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు నిల్వచేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు, వ్యర్థాలు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. జిల్లాలో బల్దియాల్లోని శివారు కాలనీలను బృందం పరిశీలించింది. ఆ వివరాలు..

చెత్త సేకరించడం లేదు..

పట్టణంలోని శివారు కాలనీలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పట్టణంలో సుమారు 20 వేల జనాభా ఉండగా 12 వార్డులు ఉన్నాయి. 1, 2, 3, 4, 5, 8 వార్డుల్లోని శివారు ప్రాంతాల్లో మురుగు కాల్వలు, సీసీ రహదారులు నిర్మించాల్సి ఉంది. మురుగు కాల్వలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది స్థానికులు విషజ్వరాల బారిన పడుతున్నారు. కొన్ని వార్డుల్లో టీయూఎఫ్ఐడీసీ నిధులతో సీసీ రహదారులు నిర్మించినా మురుగు కాల్వలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పటిష్ఠ పరచాల్సి ఉంది. చెత్త సేకరణ వాహనాలు సకాలంలో చెత్త సేకరించడం లేదనే ఫిర్యాదులున్నాయి. శివారు ప్రాంతాల్లో నూతన విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలు అమర్చాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య దుర్గంధం

పట్టణంలోని శివారు కాలనీలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. మురుగు కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్ల మధ్యే మురుగు చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. మాదాపూర్‌కాలనీ, ఏసుకొనిగుట్ట, అర్బన్‌కాలనీ, బీలాల్‌పుర, హాజీపుర, ఆదర్శనగర్, దేశాయినగర్, ఆనంద్‌నగర్ ప్రాంతాల్లో మురుగు నీరు వెళ్లేందుకు సరైన కాలువలు నిర్మించలేదు. చాలా కాలనీల్లో సిమెంట్ రోడ్లు నిర్మించకపోవడంతో ఇటీవల వర్షాలకు మట్టిరోడ్డు దెబ్బతినడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. రోడ్లకిరువైపులా, ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, చెట్ల పొదలతో నిండిపోయాయి. ఖాళీ స్థలాల్లో, ప్లాట్లలో వర్షం, మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఏసుకోనిగుట్ట, అర్బన్‌కాలనీలో సిమెంట్‌రోడ్లు లేకపోవడంతో కంకరతేలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏసుకోనిగుట్ట పంటకాలువలో మురుగునీరు ప్రవహిస్తోంది.

రోడ్లపైనే మురుగు



మెట్‌పల్లి బల్దియా పరిధిలో 26 వార్డుల్లోని శివారు కాలనీలో అభివృద్ధి అంతంత మాత్రమే ఉంది. పట్టణ శివారులోని టీచర్స్‌కాలనీ, బాలకృష్ణనగర్, హనుమాన్‌నగర్, సాయిరాంకాలనీ, ఆదర్శనగర్, రాంనగర్, సుల్తాన్‌పుర, కళానగర్, దీనదయాల్‌నగర్, ఇందిరా ప్రియదర్శినికాలనీలోని వీధుల్లో కాల్వలు లేక మురుగు నీరంతా రోడ్లపై పారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీసీరోడ్లు లేక చిన్నపాటి వర్షం కురిసిన సమయంలో రహదారులు బురదమయంగా మారి నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. పిచ్చిమొక్కలు ఇళ్ల మధ్య ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి.

తాగునీటి తిప్పలు

పట్టణంలోని శివారు కాలనీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం అస్తవ్యస్తంగా ఉంది. పట్టణంలో రెండు ఇందిరమ్మ కాలనీలు, అయ్యప్ప కాలనీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. మురుగు కాలువలు నిర్మించినా నీరు చివరికి ఎక్కడికి వెళ్లే పరిస్థితి లేక నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఇందిరమ్మ కాలనీల్లో ప్లాట్లు పొందిన వారు నిర్మాణం చేపట్టకపోవడంతో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. కాలనీల్లో మిషన్ భగీరథ పథకం పైపు నిర్మాణాలు చేపట్టడం లేదు. అయ్యప్ప కాలనీల సమీపంలో నూతనంగా ఇళ్ల నిర్మాణాలు పెరుగడంతో ఈ ప్రాంతంలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయకపోడంతో చీకట్లే నెలకొంటున్నాయి.

పారిశుద్ధ్యం అధ్వానం

జగిత్యాల పట్టణం నలువైపులా ఉన్న శివారు కాలనీల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. 48 వార్డులున్న బల్దియాలో 20 వరకు శివారు వార్డులున్నాయి. ప్రధానంగా ఆర్ఎన్‌టీనగర్, లింగంపేట, మోతెరోడ్డు, తులసినగర్, డిగ్రీ కళాశాలరోడ్డు, గోత్రాలకాలనీ తదితర ప్రాంతాల్లో మురుగు పలుచోట్ల జనావాసాల్లో నిలుస్తోంది. వర్షాకాలంలో మురుగునీరంతా ఆయా శివారుకాలనీల్లో రోడ్లపై నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చెత్త సేకరణకు నాలుగైదు రోజులకోసారి సిబ్బంది రావడంతో కాలనీల్లో పరిశుభ్రత లోపించింది. తడి, పొడి చెత్త సేకరణ శివారుకాలనీల్లోనూ అమలు కావడంలేదు. కొత్తగా మరో 100 విద్యుత్తు సంభాలు అవసరమని ప్రతిపాదనలు పంపారు.

# సామాజిక మరుగుదొడ్ల ప్రస్తావన ఏదీ..?

సిరిసిల్ల: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లెప్రగతి కార్యక్రమంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా కంపోస్టు షెడ్డు, డంపింగ్ యార్డు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు వంటివి చేపట్టారు. చాలా వరకు అన్ని గ్రామాల్లో ఇప్పటికే ఇవి పూర్తయ్యాయి. ఇటీవల ప్రారంభమైన ఐదో విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో ప్రతి గ్రామంలో ఒక క్రీడా మైదానం ఏర్పాటుకు ఎకరం స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించారు. చాలా గ్రామాల్లో స్థలాల కొరత ఉందని ప్రభుత్వానికి అధికారులు తెలిపారు. గ్రామాల్లో స్థలాభావం దృష్ట్యా కనీసం మండలానికి ఒక్కటైనా క్రీడా మైదానం ఉండాలని ఆ మేరకు రెవెన్యూ అధికారులు స్థలాలను గుర్తించాలని ప్రభుత్వం సూచించింది. ఇవన్నీ బాగున్నా మండల కేంద్రాల్లో చాలాచోట్ల శౌచాలయాలు లేక వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు



వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో సామాజిక మరుగుదొడ్లను నిర్మించాలని పలువురు కోరుతున్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో సామాజిక మరుగుదొడ్లు లేక మహిళలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు.

ఎన్నోరోజులుగా విజ్ఞప్తులు చేస్తున్నా...రుద్రంగి మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో అత్యవసరాలను తీర్చుకునేందుకు కనీస సదుపాయాలు లేవు. ప్రజా మరుగుదొడ్లు అందుబాటులోకి రావటం లేదు. మండలంలో మొత్తం జనాభా 22 వేలకు పైగా ఉన్నా ఏ ఒక్క గ్రామంలో బహిరంగ మరుగుదొడ్లు కనిపించవు.

విద్యార్థినులకు తప్పని అవస్థలు

నూతనంగా ఏర్పడ్డ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం నిత్యం మండలంలోని ప్రజలతో పాటు కథలాపూర్, చందుర్తి మండలాల నుంచి తరలి వస్తుంటారు. వివిధ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు తప్ప బయటివారికి మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. వివిధ గ్రామాల నుంచి బ్యాంకులోకి డ్వాక్రా సంఘ సభ్యులు, ప్రభుత్వ కళాశాలలకు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇలా వచ్చిన వారు బస్సుల కోసం ఇతర వాహనాల కోసం గంటల తరబడి ప్రయాణ ప్రాంగణాల్లో నిరీక్షిస్తుంటారు. ఆ సమయంలో కనీస అవసరాలు తీర్చేందుకు నేటికీ వసతులు లేక పంటి బిగువున భరిస్తున్నారు.

ఉన్నవాటిని కూల్చి.. కొత్త వాటిని విస్మరించి

మండల కేంద్రంలోని ప్రధాన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఉన్న బహిరంగ మరుగుదొడ్లను ఇటీవల తొలగించారు. ప్రయాణ ప్రాంగణంలోనే ప్రతి గురువారం వారసంత పెద్ద ఎత్తున జరుగుతోంది. ఇక్కడికి జిల్లా నుంచే కాకుండా పక్కనున్న జగిత్యాల జిల్లాకు చెందిన వందలాదిమంది వ్యాపారులు తమ వస్తువులను విక్రయించేందుకు వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కనీసం మరుగుదొడ్ల సదుపాయం కల్పించకపోవటంతో ఇబ్బందుల పాలవుతున్నారు. ఇందిరాచౌక్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు ఏళ్ల నుంచి కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. గత ఏడాది క్రితం పంచాయతీ ఆధ్వర్యంలో ఈజీఎస్ నిధుల నుంచి మరుగుదొడ్లును నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ఏడాదికి పైగా గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.

మహిళల గౌరవానికి భంగం కలగకుండా చూడాలిసిరిపురం మహేందర్

మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి ప్రతి గ్రామంలో, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేకంగా సామాజిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో నీటి సరఫరా ఏర్పాటుతో ఉండే మరుగుదొడ్లను నిర్మించాలి. రుద్రంగిలో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలను వెంటనే పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి.

ప్రతిపాదనలు పంపించామాలోత్ శంకర్, మండల అభివృద్ధి అధికారి, రుద్రంగి

మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో నూతనంగా కూరగాయల మార్కెట్ షెడ్ల నిర్మాణం చేసి అక్కడే సామాజిక మరుగుదొడ్లను నిర్మించాలని భావించాం. కేటాయించాలనుకున్న స్థలంలో పలు వివాదాలు తలెత్తాయి. అవి పరిష్కారం అయితేనే నూతన నిర్మాణం చేపట్టే అవకాశం ఉంటుంది. మండల కేంద్రంలోని ఇందిరాచౌక్‌లోని ప్రయాణ ప్రాంగణంలో నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం పనులు అతిత్వరలోనే పూర్తి చేస్తాం. మండలంలోని సర్పంచితండా, మానాల, దెగావత్ తండాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.

# మిద్దె సాగు.. ఆరోగ్యం బాగు

గోదావరిఖని :పట్టణంలోని టీచర్స్‌కాలనీలోని ఇంద్రాల సతీష్-శారద వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులు. పాఠశాలల్లో పిల్లలకు పాఠాలు బోధిస్తూనే ఇంటి వద్ద వీరు ఆచరించేలా కూరగాయల సాగుపై దృష్టి సారించారు. ఇంటి వద్దే సేంద్రియ ఎరువు తయారు చేసి పలు రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. ప్రత్యేకంగా తీగజాతి కూరగాయల కోసం ప్రత్యేక ఫ్రేమ్‌ను తయారు చేయించారు. దీంతో చిన్నచిన్న కుండీలను ఏర్పాటు చేసి అందులో ఆకుకూరలను పెంచుతున్నారు. కూరగాయలతో పాటు జామ, మామిడి, సపోట లాంటి పండ్ల మొక్కలను పెంచుతున్నారు. ఇంటి వద్దే ఎరువు తయారు చేస్తూ గత ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డును సైతం శారద అందుకోవడం విశేషం.

సేంద్రియ ఎరువు..పట్టణంలోని చైతన్యనగర్‌లో చిటికేసి రంజిత్-లాస్య దంపతులు ఏడాది నుంచి ఇంటిపైకప్పుపై వివిధ రకాల మొక్కలను పెంచుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. టమాట, వంకాయ, బీరకాయ, కాకరకాయ, బెండకాయ, సొరకాయ, గోరుచిక్కుడుతో పాటు పలు రకాల ఆకుకూరలను పండిస్తున్నారు. ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేసి మొక్కలకు వేస్తున్నారు. ఇంటిల్లిపాది ఇవే కూరగాయలను ఆహారంగా తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటున్నారు.

ప్రత్యేక పందిళ్లు..పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న ఎల్ఐసీ ఉద్యోగి ఎగ్యారపు శ్రీనివాస్ భార్య శ్రీలతతో కలిసి ఇంటిపైన వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నిత్యం ఇంట్లో లభించే చెత్తతో ఎరువు తయారు చేసుకుంటూ ఆకు కూరలతో పాటు తీగజాతి కూరగాయలను, టమాట, వంకాయ, బెండ, గోరుచిక్కుడులాంటి పంటలను సాగు చేస్తున్నారు. ఇంటిపైన వివిధ డబ్బాలతో పాటు ప్రత్యేక పందిళ్ల సాయంతో ఆకర్షణీయంగా సాగు చేసి వాటినే ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్య వంతులుగా నిలుస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



# సమ్మె సైరన్ మోగించిన పారిశుద్ధ్య కార్మికులు

అమరావతి: తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ ఒప్పంద, పొరుగుసేవల సిబ్బంది నిరవధిక సమ్మెకు దిగారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్ అమలు చేయాలంటూ మంగళవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. దాదాపు 50 వేల మంది సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల రోడ్లెక్కారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీతం రూ. 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ గుంటూరు జిల్లా మంగళగిరి నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. మంగళగిరి, తాడేపల్లిలోని నగరపాలక సంస్థ కార్యాలయాల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మంగళగిరిలో బలవంతంగా చెత్తను తరలించేందుకు అధికారులు యత్నిస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు. ట్రాక్టర్‌లోని చెత్తను రోడ్డుపై పడేసి నిరసన తెలిపారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్... తమకు ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇవ్వడం వల్లే ఆయనకి ఓట్లు వేసి గెలిపించామని, మాట తప్పితే ఆయనకు వ్యతిరేకంగా పనిచేస్తామని కార్మికులు హెచ్చరించారు. పారిశుద్ధ్య కార్మికులంటే ఎంతో ప్రేమాభిమానాలు కురిపించి, వారు చేస్తున్న వృత్తిపట్ల ఎంతో గౌరవం ప్రదర్శించిన సీఎం జగన్ గత నాలుగున్నరేళ్లలో తమకు ఏం చేశారని వాళ్లు ప్రశ్నిస్తున్నారు. కార్మిక సంఘాలు చేసిన విజ్ఞప్తులు అరణ్యరోదనగానే మిగిలాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో చుట్టూ ఉన్న గ్రామాలను విలీనం చేయడంతో నగరాల, పట్టణాల విస్తీర్ణం పెరిగింది. అదే స్థాయిలో కార్మికుల సంఖ్యను పెంచడం లేదు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు తీవ్రమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. కార్మికుల సంఖ్యను పెంచాలన్న వారి డిమాండ్‌ను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పెరిగిన పని ఒత్తిడి మేరకు వేతనమైనా పెంచారా అంటే అదీ లేదు. ఒక్కో కార్మికుడికి రూ.15 వేల వేతనం ఇస్తున్నారు. ఆరోగ్య భత్యం (హెల్త్ ఎలవెన్స్) కింద ఇచ్చే రూ.6 వేలను కరోనా తరువాత ప్రభుత్వం నిలిపివేయడంతో కార్మికులు ఆందోళన చేసి తిరిగి సాధించుకోవాల్సి వచ్చింది.

# ఏపీ ఉద్యమాంధ్రప్రదేశ్‌గా మారింది



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉద్యమాంధ్రప్రదేశ్‌గా మారిందని, పాదయాత్రలో నోటికొచ్చిన హామీలు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అందరినీ మోసం చేశారని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు, త్వరలో వాలంటీర్లు.. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రోడ్లెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెకు కూడా టీడీపీ పూర్తి స్థాయి మద్దతు ఇస్తోందన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు ఎలా అయితే రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు మద్దతు తెలిపాయో.. అలానే సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న మున్సిపల్, ఆశా వర్కర్లకు కూడా మద్దతు తెలపాలని పిలుపు ఇస్తున్నామని నారా లోకేష్ స్పష్టం చేశారు.

# గ్రావెల్ మాఫియాకు వ్యతిరేకంగా ధూళిపాళ్ల పాదయాత్ర



చేబ్రోలు: గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా ధనదాహానికి 700 ఎకరాలకు పైగా పండ్ల తోటలు కనుమరుగయ్యాయని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. అక్రమ మట్టి తవ్వకాలను నిరసిస్తూ ఆయన రెండు రోజుల పాదయాత్రను చేపట్టారు. చేబ్రోలు మండలం శ్రీరంగపురం శివారు నుంచి పాదయాత్ర ప్రారంభమైంది.

ఏడు గ్రామాల పరిధిలోని క్వారీలను పరిశీలిస్తూ పాదయాత్ర కొనసాగనుంది. స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే గ్రావెల్ తవ్వకాలు అడ్డగోలుగా జరుగుతున్నాయని ధూళిపాళ్ల విమర్శించారు. గత నాలుగేళ్లుగా రూ.2100కోట్ల విలువైన తవ్వకాలు చేపట్టారని ఆయన అన్నారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో పని చేసే రవిచంద్రకు ఈ తవ్వకాల్లో భాగస్వామ్యం ఉందని ఆరోపించారు.

**వైకాపాకు ప్రజలు బుద్ధి చెప్పాలి :** ధూళిపాళ్ల పాదయాత్రకు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తెదేపా నేత తెనాలి శ్రావణ్ సంఘీభావం తెలిపారు. "పొన్నూరు నియోజకవర్గంలో 125 కోట్ల టన్నుల గ్రావెల్ తవ్వేశారు. అక్రమ ఆదాయంలో తాడేపల్లి ప్యాలెస్‌కు వాటా పోతోంది. వచ్చే ఎన్నికల్లో వైకాపాకు ప్రజలు బుద్ధి చెప్పాలి" అని దేవినేని ఉమ అన్నారు. తెనాలి శ్రావణ్ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల పేరిట గ్రావెల్ తవ్వేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఆధ్వర్యంలోనే తవ్వకాలు జరుగుతున్నాయని చెప్పారు.

## తొలిసారిగా వంగవీటి రంగ వర్ధంతి కార్యక్రమానికి హాజరుకాని రాధా

విజయవాడ: నేడు వంగవీటి రంగ వర్ధంతి. ఈ సందర్భంగా బెజవాడ బందరు రోడ్డులో ఉన్న రంగా విగ్రహానికి పూలమాల వేసి రంగా కుమార్తె ఆశ, రాధా భార్య పుష్పవల్లి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వంగవీటి రాధ పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాశీలో రంగా తర్పణంలో పాల్గొనటం కారణంగా రాధా రాలేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఈ సందర్భంగా వంగవీటి ఆశ మాట్లాడుతూ.. వంగవీటి రాధ కాశీలో రంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. రంగా అభిమానులంతా తమ కుటుంబ సభ్యులేనన్నారు. వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజు రంగా వర్ధంతి కాబట్టి.. రాజకీయాలు మాట్లాడడం సరికాదని ఆశ పేర్కొన్నారు.



## యశస్వికి పాస్‌పోర్టు ఇచ్చేయండి.. సీఐడీకి ఏపీ హైకోర్టు ఆదేశం

అమరావతి: ఎన్నారై యశస్వి పాస్‌పోర్టును రిలీజ్ చేయాలని సీఐడీని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టారని యశస్విపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేసి 41ఏ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో యశస్వి పాస్‌పోర్టును సీఐడీ స్వాధీనం చేసుకుంది. దీంతో తన పాస్‌పోర్టును ఇప్పించాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టులో యశస్వి పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం యశస్వి పాస్‌పోర్టు ఇవ్వాలని సీఐడీని ఆదేశించింది.








# చివరకు ముంబయి చేరుకున్న భారతీయులున్న విమానం

## మానవ అక్రమరవాణా ఆరోపణలు..

ముంబయి: ఫ్రాన్స్‌లో నిలిపేసిన భారతీయ ప్రయాణికులున్న విమానం మంగళవారం ముంబయిలో ల్యాండ్ అయింది. మానవ అక్రమ రవాణా జరుగుతోందని వచ్చిన ఫిర్యాదులతో 300 మందికిపైగా ప్రయాణికులున్న విమానాన్ని విచారణ కోసం ఫ్రాన్స్‌లో ఆపిన సంగతి తెలిసిందే. నాలుగురోజుల పాటు ఫ్రాన్స్ అధికారుల అదుపులో ఉన్న ఈ విమానం సోమవారం అక్కడి నుంచి బయల్దేరి ఈ రోజు తెల్లవారుజామున ముంబయిలో దిగింది. ఈ విమానంలో ఎక్కువ మంది భారతీయులు ఉన్నారు. ఇద్దరు మైనర్లుసహా 25 మంది ఫ్రాన్స్ ఆశ్రయం కోరడంతో వారిని అక్కడే ఉంచారు. యూఏఈ నుంచి నికరాగువా బయలుదేరిన రుమేనియాకు చెందిన లెజెండ్ ఎయిర్‌లైన్స్ విమానం ఇంధనం కోసం వాట్రీ విమానాశ్రయంలో దిగిన వెంటనే ఫ్రాన్స్ అధికారులు దానిని తమ అధీనంలోకి తీసుకున్న సంగతి తెలిసిందే.

అందులో 11 మంది మైనర్ల వెంట తెలిసిన పెద్దవారు లేరని విచారణలో అధికారులు గుర్తించారు. అన్ని న్యాయపరమైన ప్రక్రియలు పూర్తి చేసిన తర్వాత విమానం ముంబయికి బయల్దేరేందుకు అనుమతి లభించింది. దీనిపై ఫ్రాన్స్‌లోని భారత రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ విషయంలో అధికారులు త్వరితగతిన స్పందించారని వెల్లడించింది. ఈ ఘటనపై భారత ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టనుంది. తొలుత ఈ విమానాన్ని దుబాయ్‌కుగానీ.. నికరాగువాకుగానీ పంపాలని భావించారు. అయితే విమానంలో భారతీయులు ఎక్కువగా ఉండటంతో చివరకు ముంబయికి పంపాలని నిర్ణయించారు. వారిలో పంజాబ్, గుజరాత్‌కు చెందిన పేద ప్రజలు ఉన్నారని మీడియా కథనాలు పేర్కొన్నాయి. అమెరికా లేదా కెనడాలోకి అక్రమంగా ప్రవేశించాలనే ప్రణాళికలో భాగంగా ఆ ప్రయాణికులంతా నికరాగువాకు వెళ్తున్నట్లు తెలిపాయి.

**మీడియాకు దూరంగా పరుగులు..** ముంబయిలో దిగిన వెంటనే ప్రయాణికులపై మీడియా ప్రశ్నల వర్షం కురిపించింది. దాంతో వారు మీడియా దృష్టి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశారు.

'ఫ్రాన్స్ నుంచి ఎవరూ రావడం లేదు సర్' అని వెల్లడించిన ఓ ప్రయాణికుడు తర్వాత అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. మరో వ్యక్తి తాను ఫ్రాన్స్ నుంచే వచ్చినట్లు అంగీకరించినా.. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి నిరాకరించాడు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి.



# పాక్ ఎన్నికల్లో ఉగ్రవాదుడు..!

ఉగ్రవాదులను కట్టడి చేశామని అంతర్జాతీయ సమాజానికి పాకిస్థాన్ ఎన్ని మాటలు చెబుతున్నా.. చేతలు మాత్రం వేరేగా ఉన్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాది, 26/11 ముంబయి దాడుల మాస్టర్ మైండ్ హాఫీజ్ సయీద్ స్థాపించిన పార్టీ ఇప్పుడు ఏకంగా అక్కడి సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి దిగింది. 'ది పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్' (పీఎంఎంఎల్) పేరిట సయీద్ ఓ పార్టీని ఏర్పాటు చేశాడు. గతంలో లష్కరే తరఫున మిల్లీ ముస్లిం లీగ్ పేరిట పార్టీ ఉండేది. కానీ, దానిపై 2018లో నిషేధం విధించారు. ఆ పార్టీ మూలాల నుంచే తాజాగా పీఎంఎంఎల్‌ను ఏర్పాటు చేశారు. దీని గుర్తు కుర్చీ. ఈ పార్టీకి ఖలీద్ మసూద్ సింధూ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. తమ పార్టీ అన్ని నేషనల్, ప్రావిన్షియల్ అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుందని అతడు ప్రకటించాడు. పైకి మాత్రం తమ పార్టీకి ఉగ్ర సంస్థ లష్కరేతో ఎటువంటి సంబంధం లేదని అతడు చెబుతున్నాడు. కానీ, పార్టీ తరఫున హాఫీజ్ తనయుడు తల్హా సయీద్ ఎన్ఏ-127 స్థానం నుంచి బరిలోకి దిగుతున్నాడు. 2000 సంవత్సరంలో హాఫీజ్ సయీద్‌ను ఐరాస అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అయినప్పటికీ.. అతడిపై ఇతర ఉగ్ర నేరాలను పాక్ మోపలేదు. అంతేకాదు.. అతడిని భారత్‌కు అప్పగించలేదు. 2019 జులై నుంచి అతడు పాకిస్థాన్ జైల్లోనే ఉన్నాడు. 2022 ఏప్రిల్‌లో ఉగ్ర నిధుల సేకరణ ఆరోపణలపై శిక్ష విధించారు. భారత హోం మంత్రిత్వ శాఖ గతేడాది ఏప్రిల్‌లో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం తల్హా సయీద్ లష్కరే క్లెరిక్ విభాగానికి అధిపతి. ఈ సంస్థ నిధుల సేకరణ, ప్లానింగ్ నియామకాల్లో అతడే చురుగ్గా వ్యవహరిస్తున్నాడు. తల్హా సయీద్ పేరును మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో చేరుస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. "తల్హా సయీద్ ఉగ్ర కార్యకలాపాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నాడని మేం విశ్వసిస్తున్నాం. అందుకే, చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్టం, 1967 కింద అతడిని ఉగ్రవాదిగా ప్రకటిస్తున్నాం" అని కేంద్ర హోం శాఖ తెలిపింది. భారత ప్రభుత్వం ప్రకటించిన ఉగ్రవాదుల జాబితాలో తల్హా 32వ వ్యక్తి. ఇదే జాబితాలో హాఫీజ్ సయీద్ పేరు కూడా ఉంది. 47 ఏళ్ల తల్హా సయీద్ పాకిస్థాన్‌లోని లాహోర్‌లో జన్మించాడు. తండ్రి స్థాపించిన లష్కరే తోయిబా ముఠాలో సీనియర్ నాయకుడైన తల్హా.. ఈ సంస్థ క్లెరిక్ విభాగానికి హెడ్‌గా వ్యవహరిస్తూ.. భారత్, అఫ్గానిస్థాన్‌లో లష్కరే నియామకాలు, నిధుల సేకరణ, దాడులకు కుట్రలు రచించడం వంటి కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఉగ్ర కార్యకలాపాలకు ఆర్థిక సహకారం అందించారన్న రెండు కేసుల్లో హాఫీజ్ సయీద్‌కు 33 ఏళ్ల జైలు శిక్ష పడిన మరుసటి రోజే.. తల్హాను ఉగ్రవాదిగా ప్రకటిస్తూ భారత్ నిర్ణయం తీసుకుంది. తాజా పరిణామాలతో ఉగ్రవాదులను కూడా పాక్ చట్ట సభల్లోకి చేర్చేందుకు అక్కడ రంగం సిద్ధమవుతోంది. పాక్‌లో 2024 ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.

# జగన్ పర్యటనలో ఫ్లెక్సీ కలకలం




నరసరావుపేట రూరల్: గుంటూరు జిల్లాలో సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఓ ఫ్లెక్సీ కలకలం సృష్టించింది. 'పోరంబోకు భూమిని కాపాడు జగనన్నా' అంటూ వైకాపా నేత చల్లా అచ్చిరెడ్డి పేరుతో నల్లపాడులో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల ప్రారంభోత్సవానికి మంగళవారం సీఎం జగన్ నల్లపాడు రానున్నారు. జగన్ పర్యటనను తెలుగు యువత, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. "ఆడుదాం ఆంధ్రా సరే.. ఆట స్థలాలు ఎక్కడ" అని నినాదాలు చేస్తూ గుంటూరు చుట్టు గుంట కూడలిలో ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పేరిట క్రీడా పోటీలు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో ముఖ్యమంత్రి జగన్ లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇవాళ్టి నుంచి ఫిబ్రవరి 10 వరకు 47 రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## 'ఆడుదాం ఆంధ్రా'ను బహిష్కరించిన వైకాపా కార్పొరేటర్లు



నల్లపాడు: గుంటూరు జిల్లా నల్లపాడులో నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వైకాపా కార్పొరేటర్లు బహిష్కరించారు. సీఎం పర్యటన దృష్ట్యా లయోలా స్కూల్ వద్ద కార్పొరేటర్లను పోలీసులు అడ్డుకున్నారు. లోపలికి అనుమతి లేదంటూ కార్యక్రమానికి పంపించేందుకు నిరాకరించారు. పోలీసుల వైఖరిపై నిరసన వ్యక్తం చేసిన కార్పొరేటర్లు అక్కడి నుంచి వెనుదిరిగారు. మరోవైపు గుంటూరులో సీఎం జగన్ పర్యటనను వ్యతిరేకిస్తూ తెలుగుయువత, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ చుట్టుగుంట కూడలిలో ధర్నా నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రాకు వ్యతిరేకంగా అడుగుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారు. ' ఆడుదాం సరే.. ఆటస్థలాలు ఎక్కడ జగన్' అంటూ నిలదీశారు. ప్రభుత్వ స్టేడియాలను నిర్వీర్యం చేసి, ప్రైవేటు విద్యా సంస్థలో ఆటలేంటని మండిపడ్డారు. నిరుద్యోగుల హామీలను గాలికొదిలేసి వారి జీవితాలతో ఆటలాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆందోళన కారులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. విద్యార్థి సంఘ నేతలపై కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి శ'ఆడుదాం ఆంధ్రా' పేరిట క్రీడా పోటీలు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో ముఖ్యమంత్రి జగన్ లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇవాళ్టి నుంచి ఫిబ్రవరి 10 వరకు 47 రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## ఇంద్రుని పుత్రిక ఇంద్రజ దిగొచ్చింది!

అతిలోక సుందరి శ్రీదేవి ఇంద్రుని కుమార్తె ఇంద్రజగా నటించి కోట్లాది మంది ప్రజల మనసులు గెలుచుకుంది. మెగాస్టార్ 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమాలో ఇంద్రలోకం నుంచి భూలోకానికి దిగి వచ్చే దేవాధిదేవుని పుత్రికగా మైమరిపించే నటనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ సినిమాలో దేవకన్యగా శ్రీదేవిని దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు ఆవిష్కరించిన తీరు మహదాద్భుతం. స్వర్గలోక పాలకుడు ఇంద్రుని కుమార్తె ఇంత అందంగా ఉంటుందా? అనిపించేంతగా శ్రీదేవి రూపం మైమరిపించింది. అయితే ఇప్పుడు శ్రీదేవి నటవారసత్వాన్ని ముందుకు తీసుకెళుతున్న జాన్వీ కపూర్ అందం నటనలో రోజు రోజుకు షైన్ అవుతున్న తీరు ఆకర్షిస్తోంది. జాన్వీ లుక్ కాలంతో పాటు చాలా మారుతోంది. జాన్వీ తాజా ఫోటోషూట్ అందుకు నిదర్శనం. ఒకవేళ ఇంద్రుని పుత్రిక ఇంద్రజగా



మళ్లీ ఎవరు నటిస్తే బావుంటుంది? అంటే.. కచ్చితంగా జాన్వీ కపూర్ అయితే బావుంటుందని ప్రశంసించి తీరాలి. అంతందంగా రాకుమార్తె ను తలపిస్తోంది ఈ ఫోటోషూట్ లో. ముత్యాలు, ఛమ్కీల డిజైనర్ దుస్తుల్లో జాన్వీ నిజంగా ఎంతో అందంగా కనిపిస్తోంది. తనను ఇలా చూశాక.. ఇంద్రుని పుత్రికగా ఇప్పుడు అర్హత సాధించింది! అంటూ ఈ ఫోటోగ్రాఫ్స్ చూశాక అభిమానులు ప్రశంసిస్తున్నారు. జాన్వీ ఒక డైమండ్ అంటూ కొందరు పొగిడేస్తున్నారు. చాలా మంది అభిమానులు లవ్- హార్ట్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న జాన్వీ తదుపరి రామ్ చరణ్ సరసన నటించేందుకు అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక రామ్ చరణ్ కథానాయకుడిగా 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సీక్వెల్ ని తెరకెక్కించేందుకు గతంలో వైజయంతి అధినేత అశ్వనిదత్ ప్రయత్నించారు. అయితే ఈ సీక్వెల్ కథాంశం రెడీ కాలేదు. మునుముందు దీనికి ఆస్కారం ఉంటుందనే అంతా ఆశిస్తున్నారు. ఒకవేళ బ్లాక్ బస్టర్ మూవీకి సీక్వెల్ తెరకెక్కిస్తే కచ్చితంగా జాన్వీ పేరు కథానాయికగా పరిశీలనలో ఉంటుందనడంలో సందేహం లేదు.

## సెల్ఫీ అందాలతో ఇస్మార్ట్ బ్యూటీ

కన్నడ బ్యూటీ నభా నటేష్ తెలుగు ప్రేక్షకులకు నన్ను దోచుకుందువటే సినిమాతో పరిచయం అయిన విషయం తెల్సిందే. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోకున్నా కూడా నటిగా మంచి మార్కులు దక్కించుకుంది. సినీ ప్రముఖులు కూడా నభా నటేష్ అందంతో పాటు అభినయం కు మంచి మార్కులు వేశారు. ఏకంగా పూరి జగన్నాథ్ సినిమా ఇస్మార్ట్ శంకర్ లో ఛాన్స్ దక్కించుకుంది. రామ్ కు జోడీగా నటించిన నభా కి ఇస్మార్ట్ శంకర్ మంచి విజయాన్ని తెచ్చి పెట్టింది. దాంతో ఇస్మార్ట్ బ్యూటీ అనే ట్యాగ్ ను దక్కించుకుంది. ఇస్మార్ట్ విజయాన్ని నభా నటేష్ సరిగ్గా ఉ



పయోగించుకోలేక పోయింది అనేది కొందరి అభిప్రాయం. సినిమాల్లో పెద్దగా ఆఫర్లు రాకున్నా కూడా సోషల్ మీడియాలో నభా నటేష్ షేర్ చేసే ఫోటోలు మరియు వీడియోల కారణంగా వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా ఈ సెల్ఫీ తో అందరి దృష్టిని తన వైపు తిప్పుకుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో నభా మరోసారి ట్రెండ్ అయ్యే విధంగా నడుము నాభి అందాన్ని చూపిస్తూ సెల్ఫీకి ఫోజ్ ఇచ్చింది. క్యూట్ అండ్ స్వీట్ అందం అంటూ నభా నటేష్ అందంకు అంతా కూడా ఫిదా అవుతున్నారు. ఇదే రేంజ్ అందాలను సోషల్ మీడియాలో కంటిన్యూ చేస్తే మళ్లీ సినిమాలతో బిజీ అయ్యే అవకాశాలు లేకపోలేదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.




## యాక్షన్ తో రంగంలోకి అందాల బ్యూటీ!





అందాల త్రిష సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. వరుసగా అవకాశాలు అందుకుంటూ నవ నాయికల్ని మించి క్రేజీ ప్రాజెక్ట్ ల్లో నటిస్తోంది. 'పొన్నియన్ సెల్వన్' ప్రాంచైజీతో అమ్మడి పేరు పాన్ ఇండియాలో మరింత బలంగా నాటుకుంది. దీంతో పాన్ ఇండియా ఛాన్సులు చేజిక్కించుకుంటుంది. ఈ నేపత్యంలో మాలీవుడ్ లో సైతం లాంచ్ అవుతుంది. ప్రస్తుతం అక్కడ మాలీవుడ్ స్టార్ హీరో టివినో థామస్ సరసన 'ఐడెంటిటీ' అనే చిత్రంలో నటిస్తోంది. తాజాగా శనివారం అమ్మడు ఈ సినిమా సెట్స్ లో అడుగు పెట్టింది. ఆరంభమే యాక్షన్ తో ప్రారంభిం చింది. హీరోతో పాటు అమ్మడు యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటుంది. దీంతో త్రిష రోల్ సినిమాలో యాక్షన్ కి స్కోప్ ఉన్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాకి ఇద్దరు దర్శకులు పనిచేయడం విశేషం. అఖిల్ పాల్- అనాస్ ఖాన్ లు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో త్రిష ఇంతవరకూ సినిమాలు చేసింది లేదు. తెలుగు..తమిళ్ లో ఎన్నో సినిమాల్లో నటించింది. భిన్నమైన పాత్రల్లోనూ కనిపించింది. యాక్షన్ చిత్రాల జోలికి మాత్రం ఇంతవరకూ వెళ్లలేదు. తొలిసారి మాలీవుడ్ లో ఆ తరహా ప్రయత్నం షురు చేస్తుంది. మరి త్రిష యాక్షన్ రోల్ ఎలా ఉంటుందన్నది? చూడాలి. టివినో థామస్ మాలీవుడ్ లో పేరున్న హీరో. ఇటీవలే '2018' వరద బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిన ఆ సినిమా తెలుగులోనూ రిలీజ్ అయి మంచి విజయం సాధించింది. ఆ సినిమాతో టివినో థామస్ కి ఇక్కడా మంచి గుర్తింపు దక్కింది. కంటెంట్ బేస్డ్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. మరి తాజా ప్రాజెక్ట్ లో త్రిష కూడా భాగమైన నేపథ్యంలో ఆ చిత్రాన్ని తెలుగు..తమిళ్ లో కూడా రిలీజ్ చేస్తారా? అన్నది చూడాలి. అలాగే మాలీవుడ్ లో కంప్లీట్ స్టార్ మోహన్ లాల్ నటిస్తోన్న' రామ్' అనే చిత్రంలోనూ త్రిష నటిస్తోంది.

## డెవిల్ సెన్సార్.. డోస్ మామూలుగా లేదు




కళ్యాణ్ రామ్ హీరోగా అభిషేక్ నామా నిర్మాతగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం డెవిల్. ఈ సినిమా డిసెంబర్ 29న ప్రపంచ వ్యాప్తంగా పాన్ ఇండియా లెవల్ లో ఐదు భాషలలో రిలీజ్ అవుతోంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకి వచ్చిన ట్రైలర్ ఆకట్టుకుంది. బ్రిటిష్ ఇండియాలో పనిచేసే ఇండియన్ సీక్రెట్ ఏజెంట్ గా ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్ కనిపించబోతున్నాడు. అతని కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో 1947 కంటే ముందు జరిగిన కథగా డెవిల్ సినిమాని చూపించబోతున్నారు. ఈ మూవీలో సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తోంది. మాళవిక నయ్యర్ కీలక పాత్రలో కనిపిస్తోంది. పవర్ యాక్షన్ సీక్వెన్స్ తో అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్ తో ట్రైలర్ ఆకట్టుకుంది. ట్రైలర్ తోనే సినిమాపై ఎక్స్ పెక్టేషన్స్ పెంచేశారు. ఇదిలా ఉంటే తాజాగా మూవీ సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ సెన్సార్ సభ్యులు ఇచ్చారు. దీనిని చిత్ర యూనిట్ అఫీషియల్ గా కన్ఫర్మ్ చేసింది. ప్రేక్షకులని థ్రిల్ చేసే పవర్ ఫుల్ యాక్షన్ మూవీ చూడటానికి ఎదురుచూడాలని పేర్కొన్నారు. ఇక ఈ సినిమాకు ట్రైలర్ తరువాత అంచనాలు మరింత పెరిగాయి. ఇక దిల్ రాజు కూడా సినిమా డిస్ట్రిబ్యూషన్ లో బాగమయ్యారు. ఇక హైప్ డోస్ ఎక్కువవుతోంది. బింబిసారాతో కళ్యాణ్ రామ్ గత ఏడాది బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకున్నారు. తరువాత అమిగోస్ అంటూ డిఫరెంట్ కాన్సెప్ట్ తో మూవీ చేశారు. అయితే ఈ సినిమా అనుకున్న స్థాయిలో ప్రేక్షకులకి కనెక్ట్ కాలేదు. కొంత గ్యాప్ తీసుకొని డెవిల్ మూవీతో ఇప్పుడు రాబోతున్నారు. ఈ సినిమాపై కళ్యాణ్ రామ్ చాలా హొప్స్ తో ఉన్నారు. పీరియాడిక్ బ్యాక్ డ్రాప్ స్టోరీ కావడంతో కచ్చితంగా ప్రేక్షకులకి నచ్చుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది విరూపాక్ష మూవీతో సంయుక్త మీనన్ హీరోయిన్ గా సక్సెస్ అందుకుంది. ఆ సినిమాలో రెండు విభిన్నమైన షేడ్స్ ఉన్న రోల్ లో మెప్పించింది. డెవిల్ మూవీలో మంచి పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉన్న పాత్రలోనే ఆమె కనిపించబోతోందని తెలుస్తోంది. నిర్మాతగా సక్సెస్ అయిన అభిషేక్ నామా ఈ మూవీతో దర్శకుడిగా తన అదృష్టం పరీక్షించుకుంటున్నారు.

## 'సలార్' రమా మన్నార్ ని చూశారా..!

ప్రభాస్ హీరోగా కేజీఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన సలార్ సినిమా ఏ రేంజ్ విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సలార్ సినిమాలో దర్శకుడు ప్రశాంత్ నీల్ ఎన్నో పాత్రలను చూపించాడు. అందులో ఒక పాత్ర రాధ రమా మన్నార్. కనిపించింది కొద్ది సమయం అయినా కూడా చాలా పవర్ ఫుల్ రోల్. రాధ రమా మన్నార్ పాత్రను తమిళ స్టార్ నటి శ్రియా రెడ్డి పోషించడం ప్రత్యేకమైన విషయం. లేడీ విలన్ గా ఎన్నో సినిమాల్లో నటించడంతో తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ అమ్మడు సుపరిచితురాలు అనే విషయం తెల్సిందే. సలార్ లో రమా మన్నార్ పాత్ర ను అద్భుతంగా పోషించిన శ్రియా రెడ్డికి విమర్శకుల ప్రశంసలు దక్కుతున్నాయి. సలార్ లో తాను అద్భుతమైన పాత్ర పోషిస్తున్నాను..



కచ్చితంగా ప్రేక్షకులు సర్ ప్రైజ్ అయ్యే విధంగా పాత్ర ఉంటుంది అంటూ పలు సార్లు శ్రియా రెడ్డి సినిమా విడుదలకు ముందు చెప్పుకొచ్చింది. అయితే సినిమాలోని లుక్ ను ఎప్పుడు కూడా రివీల్ చేయలేదు. తాజాగా సినిమా విడుదల అయిన నేపథ్యం లో తన లుక్ ను రివీల్ చేసింది. సినిమాలో ఎలా అయితే కనిపించిందో అదే లుక్ ఫోటో షూట్ ను సోషల్ మీడియా ద్వారా శ్రియా రెడ్డి షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. సలార్ సినిమాలో ఈ ఔట్ ఫిట్ తో చాలా సీరియస్ పాత్రలో శ్రియా రెడ్డిని ప్రేక్షకులు చూస్తారు. పాత్రకు తగ్గట్లుగా మేకోవర్ ఉండటంతో పాటు, చాలా అందంగా కూడా శ్రియా రెడ్డి కనిపించిందని టాక్. సలార్ లో రాధ రమా మన్నార్ పాత్ర తో అలరించిన శ్రియా రెడ్డి త్వరలో పవన్ తో కలిసి 'ఓజీ' సినిమా తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. సాహో సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఓజీ సినిమా లో కూడా శ్రియా రెడ్డి చాలా పవర్ ఫుల్ రోల్ లో కనిపించబోతుందట. ఆ పాత్ర ఎలా ఉంటుంది, ఆ లుక్ ఎలా ఉంటుంది తెలియాలి అంటే వచ్చే ఏడాది వరకు వెయిట్ చేయాల్సిందే.

## సోఫాలో పూజ పరిమళించిన పువ్వులా!

పూజాహెగ్డే మళ్లీ టాలీవుడ్ పై దృష్టి పెడుతోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ కి ఎగురుకుంటూ వెళ్లినా అమ్మడికి అక్కడా పనవ్వడం లేదు. తాను ఒకటి అనుకుంటే ప్రాక్టీకల్ గా మరోకటి జరుగుతుంది. దీంతో వ్యత్యాసం పెరిగిపోతుంది. జాబితాలో సినిమాల సంఖ్య తగ్గితే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో తెలిసిందే. మార్కెట్ లో పేడౌట్ అనే ముద్ర ఒక్కసారి పడిందంటే? కెరీర్ పై అది తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఆ ఛాన్స్ ఇవ్వకుండా బుట్టబొమ్మ ముందుగానే జాగ్రత్త పడుతుంది. అందుకే ఎందుకొచ్చిన బాలీవుడ్ అని మళ్లీ టాలీవుడ్ లో పై దృష్టి పెడుతుంది. ఈ నేపథ్యంలో తనకు బాగా క్లోజ్ గా ఉండే వాళ్లతో అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తోంది.



ఈ క్రమంలోనే అమ్మడు ఓ మూడు ఛాన్సులు వస్తున్నట్లు కూడా ఈ మధ్య ప్రచారం సాగింది. వాటిలో పూజ పేరు కేవలం పరిశీలనలోనే ఉంది. ఆ ఛాన్సులు ఎలాగైనా ఒడిసిపట్టు కోవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు నవ నాయికల నుంచి గట్టి పోటీ కనిపిస్తుంది. మీనాక్షి చౌదరి...శ్రీలీల లాంటి భామలు ఇప్పటికే పూజా స్థానంలోకి వచ్చారనే వార్త అమ్మడిని మరోవైపు గందరగోళానికి గురిచేస్తోంది. మరి ఇవన్నీ దాటుకుని అమ్మడు మళ్లీ టాలీవుడ్ లో ఎలా బిజీ అవుతుంది? అన్నది చూడాలి. ఆ సంగతి ఎలా ఉన్నా అమ్మడు సోషల్ మీడియా లో ఎంత యాక్టివ్ గా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో యువత హృదయాల్ని ఛిద్రం చేసేస్తుంది. బికినీ..స్విమ్ షూట్ అంటూ కాక పుట్టించడం పరిపాటే. తనదైన మార్క్ అందాల ఎలివేన్ తో కుర్రాళ్లను ఆకట్టుకుం టుంది. తాజాగా సొగసరి నలుపు వర్ణం డిజైనర్ ఔట్ ఫిట్ లో మెరుసిపోతున్న ఫోటో షేర్ చేసింది. అందులో అమ్మడు సోఫాలో కూర్చుని వివిధ భంగిమల్లో కెమెరాకి ఫోజులిచ్చింది. ఎప్పటిలాగే పూజా మార్క్ బ్యూటీ పిక్ లో హైలైట్ అవుతుంది. అమ్మడి అందాల్ని చూసి తరించడం అభిమానుల వంతైంది.



# ప్రధాని మోదీతో గంటపాటు సమావేశమైన సీఎం రేవంత్, భట్టి

**దిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దాదాపు గంట పాటు ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రధానితో వారు చర్చించారు. అభివృద్ధి ప్రాజెక్టులు, నిధుల మంజూరు గురించి చర్చించినట్టు సమాచారం. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రధానిని కలవడంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది.**

# గురుగోవింద్ సింగ్ పోరాటం చాలా గొప్పదిరి



హైదరాబాద్: గురుగోవింద్ సింగ్ పోరాటం చాలా గొప్పదని.. వారి కుమారుల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు వీర్ బాల్ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేటలోని గురుద్వార్‌ను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... పదో సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ కుమారులైన.. బాబా జోరావర్ సింగ్ (9 ఏళ్లు), బాబా ఫతే సింగ్ (6 ఏళ్లు) ధర్మ కోసం బలిదానం అయ్యారని.. వారి పెద్ద కుమారులు సైతం మొఘల్ సైన్యంతో పోరాటం చేసి ధర్మం కోసం బలిదానం చేశారని చెప్పారు. చివరకు గురు గోవింద్ సింగ్ ఇద్దరు పుత్రులు కూడా ఔరంగజేబు సైన్యం బంధించి సిక్కు మతం నుంచి ఇస్లాం మతంలోకి మారాలని ఒత్తిడి చేసిందన్నారు. ఇస్లాంను స్వీకరించాలి, సిక్కు మతాన్ని వదిలేయాలని అనేక రకాలుగా వేధింపులకు, దౌర్జన్యాలకు గురిచేశారని కిషన్‌రెడ్డి తెలిపారు.

మతం మారే ప్రసక్తే లేదని ఆ ఇద్దరు పసిపిల్లలు ఔరంగజేబుకు, మొఘల్ సైన్యానికి సవాల్ విసిరారని చెప్పారు. చివరకు ఆ ఇద్దరు పసిపిల్లలను నిర్దాక్షిణ్యంగా ప్రాణాలతో సమాధి చేసి వారిని బలిగొన్నారని.. వారి త్యాగనిరతికి స్ఫూర్తిగా డిసెంబరు 25వ తేదీన ఢిల్లీలో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో "వీర బాల్ దివస్" నిర్వహించాలని దేశమంతా వేలాది కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. దేశంలోని చాలామంది మంత్రులు, ముఖ్యమంత్రులు, శాసనసభ్యులు అనేక ప్రాంతాల్లో గురుద్వార్‌కు వెళ్లి శ్రద్ధాంజలి ఘటిస్తున్నారని గుర్తుచేశారు. వీర పోరాటంలో మరణించిన వీర బాలలకు ఈరోజు నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నానని కిషన్‌రెడ్డి అన్నారు. గురుగోవింద్ సింగ్ చేసిన పోరాటం గురించి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసి వీడియోల ద్వారా కేంద్ర ప్రభుత్వం వివరిస్తోందని తెలిపారు. విదేశీయులతో, ఆక్రమణ దారులతో పోరాటం చేసిన గురుగోవింద్ సింగ్, వారి తనయులను మనందరం కదా స్మరించుకోవాలని... వారి స్ఫూర్తితో దేశ అభివృద్ధి కోసం ముందడుగు వేయాలని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.




హైదరాబాద్: మాజీ ప్రియుడిని గంజాయి కేసులో ఇరికించి జైలుకు పంపించేందుకు ఓ యువతి పన్నిన పన్నాగం పోలీసులను నివ్వెరపోయేలా చేసింది. హైదరాబాద్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో అసలు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. రహమత్‌నగర్‌లో నివాసముంటున్న రింకీ.. అమీర్‌పేటలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తోంది. సరూర్‌నగర్‌కు చెందిన శ్రవణ్ కూడా అదే ప్రాంతంలో పనిచేస్తున్నాడు.

వీరిద్దరూ కొంతకాలం ప్రేమించుకున్నారు. ఆ తర్వాత శ్రవణ్ ఆమెను దూరం పెడుతూ వచ్చాడు. దీంతో అతనిపై కక్ష పెంచుకున్న రింకీ.. ఎలాగైనా అతడిని జైలుకు పంపి ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుంది. పథకం ప్రకారం.. తన స్నేహితులతో కలిసి మంగళ్‌హాట్‌లో రూ.4 వేలకు 40 గ్రాముల గంజాయి కొనుగోలు చేసింది. 8 గ్రాముల చొప్పున ఐదు ప్యాకెట్లు తయారుచేసి తన వద్ద పెట్టుకుంది. తన స్నేహితులతో శ్రవణ్‌కు ఫోన్ చేయించి.. అమీర్‌పేట సమీపంలోని ఓ పార్క్ వద్దకు రప్పించింది. ఆ తర్వాత రింకీ, ఆమె స్నేహితులు, శ్రవణ్‌తో కలిసి జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌కు వెళ్లారు. అందరూ పబ్‌లో ఉన్న సమయంలో రింకీ.. తనకు తెలిసిన ఓ కానిస్టేబుల్‌కు ఫోన్ చేసి.. శ్రవణ్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నారు, ఫలానా నంబరు కారులో గంజాయి ప్యాకెట్లు ఉన్నాయని చెప్పింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కారును తనిఖీ చేయగా గంజాయి పొట్లాలు లభ్యమయ్యాయి.
వెంటనే శ్రవణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. కారు నాది కాదు, వేరే వాళ్ల కారులో వచ్చానని చెప్పాడు. దీంతో కారులో వచ్చిన వారందరినీ పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో అసలు విషయం వెలుగుచూసింది. తనను దూరం పెట్టాడనే కక్షతోనే మాజీ ప్రియుడు శ్రవణ్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని రింకీనే ఇదంతా చేసిందని పోలీసులు తేల్చారు. ఈ కేసులో రింకీతో పాటు ఆమెకు సహకరించిన మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

# హిందూ క్షేత్రాలను ఎందుకు వివాదం చేస్తున్నారు



కరీంనగర్: కేరళకు అయ్యప్ప భక్తులు వెళ్లకుండా కుట్రలు చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. మంగళవారం నాడు బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అయ్యప్ప భక్తుల ఇబ్బందులు పాలకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. హిందూ క్షేత్రాలను ఎందుకు వివాదం చేస్తున్నారని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని నాశనం చేసే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. తబ్లీగీ జమాత్‌ను ఇస్లామిక్ దేశాలు నిషేధించాయని... ఆ సంస్థని రాష్ట్రానికి ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. కొవిడ్‌ను తెలంగాణ రాష్ట్రానికి తెచ్చిందే తబ్లీగీ జమాత్ సంస్థనేనని చెప్పారు. తిరుపతిలో పులులు వస్తే భక్తులకు కర్రలు ఇస్తారా అని ఎద్దేవా చేశారు. తిరుమలకు భక్తులు రాకుండా కుట్రలు చేస్తున్నారని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేయూలో 28 నుంచి 30 తేదీ వరకు ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సులు



వరంగల్: కాకతీయ యూనివర్సిటీలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సులను ఈనెల 28, 29, 30వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలోని ప్రధాన యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్లు సదస్సులో పాల్గొంటారని చెప్పారు.
11మంది యువ పరిశోధకులకు అవార్డులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. 1935లో అలహాబాద్ కేంద్రంగా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ స్థాపించబడిందని వీసీ రమేష్ తెలిపారు.




హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మదాపూర్‌లో నిర్వహించ తలపెట్టిన సన్‌బర్న్ కార్యక్రమాన్ని నిర్వాహకులు రద్దు చేశారు. ఈ ఈవెంట్‌కు సంబంధించి బుక్‌మై షోలో టికెట్ల విక్రయాన్ని కూడా నిలిపివేశారు.

ఈ వ్యవహారంపై ఈవెంట్ నిర్వాహకుడు సుమంత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతి తీసుకోకుండా టికెట్లు విక్రయించినందుకుగానూ బుక్ మై షో, నోడల్ అధికారులకు నోటీసులిచ్చారు. ప్రస్తుతం బుక్ మై షోలో 'సన్ బర్న్ షో హైదరాబాద్' ఈవెంట్ కనిపించడం లేదు. విశాఖ వేదికగా జరగబోయే సన్‌బర్న్ ఈవెంట్ టికెట్లు మాత్రం అమ్ముడుపోతున్నాయి. సన్‌బర్న్ అనేది భారీ సంగీత వేడుక. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఈవెంట్లు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలో మద్యం అనుమతి ఉంటుంది. ఇదే అదనుగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో జరిగిన కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఈవెంట్‌కు అనుమతి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఆ వెంటనే సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులు ఈవెంట్ నిర్వాహకుల్ని, బుక్ మై షో ప్రతినిధుల్ని పిలిపించుకుని గట్టిగా మందలించారు. ఈ నేపథ్యంలో ఈవెంట్ నిర్వహణపై వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

# దేశాన్ని మోదీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తుంటే చూస్తూ ఊరుకోం



హైదరాబాద్: దేశాన్ని మోదీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తుంటే చూస్తూ ఊరుకోమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. మంగళవారం నాడు సీపీఐ కార్యాలయంలో సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు, నారాయణ, చాడా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... "బీజేపీ ప్రమాదకర సిద్ధాంతాలతో, ఆలోచనలతో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. అయోధ్య రామమందిరానికి నాంది పలికి%శీ%ది ఎల్కే అద్వానీ.. కానీ అదే అద్వానిని రామ మందిర ప్రారంభోత్సవానికి రావొద్దని చెప్పారు. బీజేపీ మోస్ట్ క్రిమినల్ గవర్నమెంట్. క్రిమినల్ గ్యాంగ్, మోదీ, అమిత్ షా, క్రిమినల్ గ్యాంగ్ దేశాన్ని పరిపాలిస్తోంది. దేశ సంపదను ఆదానీ చేతికి అప్పగించారు. లెఫ్ట్ వింగ్ ప్రమాదకరమని చెబుతున్నారు. ఉప చట్టాలను మరింత ప్రమాదకర%శీ%గా తయారుచేస్తున్నారు. దేశానికి రైట్ వింగ్ ప్రమాదకరమా..? లెఫ్ట్ వింగ్ ప్రమాదకరమా అనేది తెల్సుకోవాల్సిన అవసరం ఉంది" అని నారాయణ తెలిపారు.

**మోదీ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారు....** "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారు. మనుధర్మాన్ని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్‌తో పాటు విచారణ సంస్థలను పెంపుడు కుక్కల్లా తయారు చేశారు. ఇండియా పేరు చూసి మోదీ ప్రభుత్వం భయపడుతోంది. విద్యా వ్యవస్థను పూర్తిగా కాషాయ మయం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పార్లమెంట్‌పై దాడి జరిగింది.

దాడి చేసిన వారికి బీజేపీ ఎంపీ పాసులు ఎట్లా ఇచ్చారు..? పాసులిచ్చిన బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోకుండా నిరసన తెలిపిన సభ్యులను సస్పెండ్ చేశారు. పై స్థాయిలో బిల్లులను అమోదించుకోవడానికి పార్లమెంట్‌పై దాడికి ప్లాన్ చేసుకున్నారు. దేశాన్ని కాపాడుకోవాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మోదీ ప్రజాస్వామ్యాన్ని తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వ కార్డు ప్రపంచంలో ఎక్కడికెళ్లినా గుర్తింపు ఉంటుంది" అని నారాయణ పేర్కొన్నారు.

**సోవియట్ విప్లవం ఒక గుణాత్మకమైన మార్పు :** "1917కు ముందు విశ్వంలో ఒకే గ్లోబ్ ఉండేది. 1917 సోవియట్ విప్లవం వచ్చిన తర్వాత విశ్వంలో ఒక ఎర్ర చుక్క పొడిచింది. సోవియట్ విప్లవం ఒక గుణాత్మకమైన మార్పు. బ్రిటిష్ దొరలను తరమాలని అనుకున్నారు తప్ప ఎలాంటి స్వాతంత్ర్యం కావాలని ఎవరు అనుకోలేదు. దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించిన తర్వాతే స్పష్టమైన స్వాతంత్ర్య రాజ్యాంగ దేశం ఏర్పడింది. వారసత్వ ఉద్యమం స్ఫూర్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉంది. దేశ స్వాతంత్ర్యలో కమ్యూనిస్ట్ పార్టీ వేలాదిమంది అమరవీరులను పోగొట్టుకుంది. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పార్టీ పాత్ర లేదు. కులాలు, మతాల పేరు మీద దేశం విచ్ఛిన్నం అయ్యే ప్రమాదం ఉంది. ఈరోజు దేశం విచ్ఛిన్నం చేసేందుకు విభజించు పాలించు అనే పద్ధతిలో పాలక గణాలు, ప్రభుత్వాలు ఉన్నాయి. దేశం ఐక్యంగా ఉండాలి. భిన్నత్వంలో ఏకత్వంలా దేశం బలంగా ఉండాలి.

దున్నే వాడికి భూమి కావాలనే ఉద్యమం నుంచి సాయుధ పోరాటంతో వరకు దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ అనేక నిర్భాంధాలను ఎదుర్కొన్నది" అని నారాయణ తెలిపారు.

# విశ్వం ఉన్నంత వరకు ఎర్ర జెండా ఉంటది



హైదరాబాద్: విశ్వం ఉన్నంత వరకు ఎర్ర జెండా ఉంటుందని సీపీఐ తెలంగాణ కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు సీపీఐ కార్యాలయంలో సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు, నారాయణ, చాడా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... "తెలంగాణ రాష్ట్ర ప్రజలకు భారత కమ్యూనిస్ట్ పార్టీ 99వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. కమ్యూనిస్ట్ మేనిఫెస్టో ప్రకటించుకున్న రోజు అనేక బలిదానాలను, అనేక త్యాగాలను ఎదుర్కొని 99 ఏళ్లుగా ముందుకు నడుస్తున్నాం. 1849 కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్ట్ మేనిఫెస్టో రూపొందించారు" అని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

**కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు :** "రష్యా విప్లవం ప్రపంచానికి ఒక మార్గదర్శకాన్ని ఇచ్చింది. బలం ఉన్నోడిదే రాజ్యం కాదు.. శ్రమ పడ్డోడిదే రాజ్యమని కార్ల్‌మార్క్స్ నూతన మార్గాన్ని సూచించారు. ఆ పునాదుల మీదే భారతంలో సీపీఐ ఉద్భవించింది. కమ్యూనిస్ట్ పార్టీ ఉద్భవించిన తర్వాతే అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. దేశంలో ఔట్ సోర్సింగ్ పేరుతో కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. కోట్లాది మంది పేదరికంతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. పాలకుల ప్యారమీటర్స్ పేపర్ల వరకే పరిమితమవుతున్నాయి. ఎర్రజెండా పార్టీ నుంచి ఒక్క ఎమ్మెల్యేని తెలంగాణలో గెలిచాను. రోజుకొక పార్టీ మారే హీనులు కమ్యూనిస్టుల పార్టీలపై అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారు. 99 ఏళ్లలోకి అడుగు పెట్టాం. ఏడాది పాటు కమ్యూనిస్ట్ ఉత్సవాలు జరుకుంటాం" అని కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.

# మేడిగడ్డ కుంగిపోవటం తెలంగాణకే తలవంపులు: మంత్రి కోమటి రెడ్డి




ఖమ్మం జిల్లా: బీఆర్ఎస్ పాలనలో విధ్వంసానికి గురైన తెలంగాణలో పాలనను గాడిలో పెడుతున్నామని, ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయలు దోచుకున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విమర్శించారు. మంగళవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఇన్ ఛార్జీ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం డిజైన్ చేశానని చెప్పుకున్న కేసీఆర్ ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని, కనీసం కాలువలు తవ్వలేదని విమర్శించారు. మేడిగడ్డ కుంగిపోవటం తెలంగాణకే తలవంపులని అన్నారు. మేడిగడ్డ కుంగటం విధ్వంస చర్య అని కల్లబొల్లి మాటలు చెప్పారన్నారు.

ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. పేదవాడి ఆత్మగౌరవం నిలబెడతామని, నిజాయితో కూడిన పాలన ప్రజలకు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి స్పష్టం చేశారు.

# పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు

నల్గొండ: పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం నాడు నల్గొండలో ప్రజా పాలన సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ వర్గానికి న్యాయం జరగలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు హామీలు అమలు చేశామని చెప్పారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన పారదర్శకంగా చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో మొదటిసారి గెలిచినా ఎమ్మెల్యేలు కూడా రాజులా ఫీల్ అయ్యారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని గర్భాలు పలికారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సెటైర్లు వేశారు. గతంలోనూ ఉమ్మడి నల్గొండ జిల్లా నేతలతో తనకు మంచి రాజకీయ సంబంధం ఉందని జిల్లా ఇంఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తన హయాంలో మొదలైన ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాలు మళ్లీ మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి హయాంలో పూర్తి కాబోతున్నాయని చెప్పారు. ఈ ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ముందుకు తీసుకుపోతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com